

ఈ వారం అంశం: "పిచ్చివాళ్ళు"
పేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా. రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు.
2025 "వారం వారం కవితల వర్క్ షాప్" 29కు మొత్తం 21 మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు. 4 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.

-డా॥రావి రంగారావు
9247581825

## వచన కవితలు

### ఊబి

ఆకలితో ఏడిస్తే తల్లి చనుబాలు పడుతుంది అనుకొనే
చిన్నారి శిశువు పిచ్చివాడు,
ఆరు బయట మంచము మీద తాత కథలు వింటూ
నిదుర పోవాలి అనుకొనే బాలుడు పిచ్చివాడు,
చద్ది అన్నములో చల్ల పోసుకొని
అవకాయ ముక్క నంజుకు తిని
బడికి వెళ్ళాలి అనుకొనే అబ్బాయి పిచ్చివాడు,
బండెడు పుస్తకాలు మోయకుండా
పలకా బలపము పట్టుకొని బడికి పరిగెత్తాలని
తలచే విద్యార్థి పిచ్చివాడు,
డ్రిల్లు పీరియడులో ఆరుబయట ఆటలాడుకోవచ్చు అని
తలచే పాపడు పిచ్చివాడు,
ఉత్తర దక్షిణాలు అంటే దిక్కులు అని ఇంటర్వ్యూ లో ధీమాగా
చెప్పే ఉద్యోగార్థి పిచ్చివాడు,
లంచము తీసుకుంటే కంచము కరువు అవుతుంది అనుకొనే
ఉద్యోగి పిచ్చివాడు,
ఓటు వేసి గెలిపించిన తమ నాయకుడు
సహాయము అడగంగానే చేస్తాడు
అనుకొనే వాడు పిచ్చివాడు,
సర్కారు దవాఖానాలో అన్ని ఉచితము అని నమ్మి అక్కడ
చేరదలచుకొనే రోగి పిచ్చివాడు,
కల్తీ చేస్తే యమలోకంలో బాధపడవాల్సి వస్తుందని తలచి
నిక్కచ్చి వ్యాపారము చేసేవాడు పిచ్చివాడు,
నైతిక విలువలు గలవాడిని అనుకొని
ఒకే పార్టీలో ఉండదల్చుకొనే రాజకీయ నాయకుడు పిచ్చివాడు,
అమెరికాలో పెళ్ళాడిన కొడుకు ఆఖరి చూపుకు వస్తాడని
ఆశపడే తండ్రి పిచ్చివాడు,
చివరకు ఈ పిచ్చి ప్రపంచములోకి
ఎప్పుడు కాలు పెడదామా అనుకొని
తల్లి పొట్టను రోజు తన్నే గర్భస్థ శిశువు
ఊబి లోకి దిగ బోతున్న నిఖార్సు అయిన పిచ్చివాడు

-పూసపాటి

ఎవరు ఈ పిచ్చోళ్ళు!
సృష్టి స్థితి లయల్లో
బతుకు చిత్రం తెలియక
మూణాళ్ల ముచ్చటకే
మురిసి మురిసి చస్తున్నారు!.
నేను నాదంటూ
అర్రులు చాచి అహం వీడక
సుఖ దుఃఖాల సాగరంలో
మునగ లేక తేలలేక
మాయాజాలంలో చస్తున్నారు!.
ఏమీ లేదని, ఏమీ రాదని
ఉదయించిన కిరణమే అస్తమించి
చెబితే
అందీ అందని ఆశల కోసం
అలుపెరగక ఉరుకులు పెట్టి
వెర్రివారిలా చస్తున్నారు!.
సమాజమే దేవాలయ మని
ప్రాణు లన్నీ ఒకటే నని
ఆత్మ దర్శనం చేసుకోలేక
దారుణంగా మారణంగా
ఒంటరి వారై చస్తున్నారు!.
పంచభూతాలని పంచేంద్రియాలని
శ్వాసించి ఆస్వాదించీ
మంచితనానికి మార్గం వేయక
ఏమి కట్టుకు పోదామని
స్వార్థాలను క్రోధాలను
ఆహ్వానించి చస్తున్నారు!
విధి విదిల్చిన జీవులు
జ్ఞాన జ్యోతిని వెలిగించి
మనసు మర్మం తెలుసుకోక
అజ్ఞానపు చీకటిలో
అలమటించి చస్తున్నారు!

-చల్లా సత్యవతి

### పిచ్చివాడు

అవును నిజమే..
అతను పిచ్చివాడు
ఎవరికీ అంతగా నచ్చని వాడు..!.
స్వార్థం ఎరుగనివాడు
సాటి మనుషులంటే..
గుండె నిండా
మమకారాన్ని నింపుకొని
సాగేవాడు
చెఱకుగడలాంటి
మనసున్నవాడు..!!.
అతను ఎప్పుడు
నిజాన్ని గౌరవించేవాడు
నిజాయితీగా
బతకాలనుకొనేవాడు.
అబద్ధానికి ఆమడ దూరం వుండే
వాడు..
చీకటి దారులకు
చిక్కని దీపము వంటివాడు..!!.
మోసమనే మాట ఎరుగనివాడు
చెప్పుడు మాటలకు
చెవియొగ్గని వాడు
ఎవరిబతుకుతో కూడా
చెలగాటం ఆడాలని
ఆశ పడనివాడు..
సామాజిక రుగ్మతలకు
చేదుమాత్రం వాడు..!.
అసూయ ద్వేషం..
కుళ్ళు కుతంత్రాలతో సాగే
నేటి లోకానికి
సరిపడనివాడు వాడు
అందుకే వాడు పిచ్చివాడు.
ఎవరికీ అంతగా నచ్చనివాడు

-ఎస్. ముంతాజ్ బేగం

పచ్చనోటు ఎరకి ఓటు ఆయుధాన్ని అప్పగిస్తూ
మనకబార్చుకుంటున్న జీవనాల్లో
వెలుగుకై వెంపర్లాడుతూ
తమ వేలితో తమ కన్నే పొడుచుకుంటున్న
ఓటర్లు పిచ్చోళ్ళు,
అనురాగాలు గంగ పాలు చేసినా
అవమానాస్త్రాలతో రక్త సిక్తం చేసినా
కంటి పాపల వెలుగుకై కొవ్వొత్తిలా కరుగుతూ
కడగంటి చూపూ కరువై నేలకొరుగుతున్న
కన్నవారు పిచ్చోళ్ళు,
వికసించని కుసుమాలకూ
పరిమళాలు అద్దుకోవాలని
సాహితీ వనం లో వటవృక్షమై వేళ్లూనాలని
ఉవ్విళ్ళూరుతూ
కాళ్ళని అరగిస్తూ, కాసుల్ని కరగిస్తూ
అవార్డులకై అర్రులు చాచే పిచ్చోళ్ళు,
వెర్రి మొర్రి అర్భాటాల పూనకాలతో
రీల్స్, ట్రోల్స్ లనే పరవశాలతో తేలిపోతూ
ప్రాణాలనే నైవేద్యంగా అర్పిస్తున్న
సోషల్ మీడియా పిచ్చోళ్ళు,
మానవత్వంతో మసిలితే పిచ్చోళ్ళు
నిర్భయత్వంతో వెలిగితే పిచ్చోళ్ళు
ఆధ్యాత్మిక వైరాగ్యాలతో మునిగితే పిచ్చోళ్ళు
మానసిక దౌర్భాగ్యాలతో మెలిగితే పిచ్చోళ్ళు,
అరిషడ్వర్గాల మేలి ముసుగులో చిక్కుకుని
చిత్త భ్రాంతుల్లో చిత్తవుతూ
నిత్యం మాయాలలో భ్రమిస్తూ, పరిభ్రమిస్తున్న
మనుషులంతా పలు రకాల పిచ్చోళ్ళే,

-మేడిశెట్టి సుభద్రా కృష్ణ

## అంశం: బెదిరిపోతున్న మనిషి

### ఇది కలి యుగం కదా

రేపటి దినాన్ని తలచుకుని
కునుకు తీయడం మరచి పోతున్నాడు,
నీరు తాగాలంటే బెదురు,
కూరలు కొనాలంటే బెదురు,
పాలు కొనాలంటే బెదురు,
ధాన్యాలు కొనాలంటే బెదురు,
ఆస్పత్రికి వెళ్ళాలంటే బెదురు,
ముందు బిళ్ళలు వేసుకోవాలంటే బెదురు...
కల్తీ కదా అన్నీ!.
ఆడపిల్లను కనాలంటే బెదురు,
చదువులకు పంపాలంటే బెదురు...
గురువుల్ని నమ్మడ మెలా!.
ముసలి తనం వస్తుందంటే బెదురు,
స్థలాలు కొనాలంటే బెదురు,
నాయకులను చూస్తే బెదురు,
ఓటెయ్యాలంటే బెదురు...
దందాలు కబ్జాల రాజ్యంలో!.
కలి ముదిరిన కాలంలో
తన నీడను చూచుకొని
బెదిరి పోతున్నాడుమనిషి!

-అనుముల బదరీనారాయణ

ఉదయపు అందాన్ని,
రాత్రుల ప్రశాంతతని,
సంధ్యా రాగాలను,
ప్రతి రోజూ జీవితాన్ని
ఆస్వాదించడానికి
బెదురుతున్న మనిషి!.
మానవత్వ పరిమళాలను
మంచితనపు ఛాయలను
మన అనే వాళ్ళ పలకరింపును
మన వాళ్ళ కై మోయాల్సిన బరువును
చూసి బెదురుతున్న మనిషి!.
బాధ్యతలను బంధాలను
అర్థం చేసుకోలేక
బెదురుతున్న మనిషి,
హక్కులను అన్యాయాలను అడగలేక
బెదురుతున్న మనిషి,
అవసరమైన చోట సర్దుకుపోలేక
అవసరాల కోసం రాజీ పడుతూ
బెదురుతున్న మనిషి...
ఊపిరి తీసుకోడానికి
ఊసులు పంచుకోవడానికి
బెదురుతున్న మనిషి,
మనసులో ఆలోచనలతో
ఆలోచనలో అపసవ్యాలతో
బెదురుతున్న మనిషి...
ఒపటి గురించి ఊహించడానికి
నిన్నటి గతాన్ని గుర్తుచేసుకోడానికి
నిన్న రేపు ఊగిసలాటలో
నేడులో జీవించడానికి
బెదురుతున్న మనిషి...
మనిషి మనిషిగా బతకడానికి
మంచి చెడుల
తారతమ్యాన్ని చూపడానికి
బెదురుతున్న మనిషి!

-వాసు రాచకొండ

### ఎందుకోయ్ బెదురు

బెదురు ఎందుకు ఓ మనిషి?
అసలు నువ్వుంటేగా....,
పగిలిపోయిన ఆశల అద్దంలో
ఎన్నిసార్లు చూసుకున్నా...
ఆరిపోయిన కాష్టంలో
ఎన్ని జ్ఞాపకాలు వెతుక్కున్నా...
నలిగిపోయిన జీవిత యానంలో
ఏ నవ్వులు వెతుక్కున్నా...
బ్రతుకంతా..భయమే నడిపించింది.
ఎదురు లేదనుకుని ఎగిరిన ఆశయాలు
అవినీతి కోరల కాటుకు బలయ్యిపోతే,
కుదురులేకుండా కదిలిన ఆనందాలు
కన్నీటి సెలయేటిలో
కొట్టుకుపోతుంటే,
అప్పుల లెక్కలు మిగుల్చుతున్న
మందులు సరిపోకపోతే,
నమ్మకాలు అనంతానికి పారిపోయి
మనిషే, మనిషిని
భూతంలా చూస్తూ ఉంటే,
ఇరుకైపోతున్న అభిమానాలు
ఇబ్బంది పాలవుతున్న ఆరోగ్యాలు
తడి ఆరిపోయిన హృదయాలు
పొడి బారిపోయిన విశ్వాసాలు
వీటన్నిటితో
మనిషి బెదిరిపోతున్నాడు,
పద్మావ్యూహంలోకి
వెళ్లిన అభిమాన్యునిగా
బయటకి రాలేనని తెలిసి
బెదురుతూనే పోరాడుతూ
సొలసిపోతున్నాడు!

-శ్రీఅరుణంశ్రీనివాస్

## మౌనశ్రీ మల్లిక్‌కు సినారె పురస్కారం బహూకరణ



మౌనశ్రీని సన్మానిస్తున్న మధుసూదనాచారి, దైవజ్ఞశర్మ, వంశీ రామరాజు తదితరులు.

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో సత్య సంగీత ఇంటర్నేషనల్ వారు జ్ఞాన పీఠ పురస్కార గ్రహిత డా॥సి. నారాయణరెడ్డి జయంతిని పురస్కరించుకుని సినీ, టీవీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్‌కు సినారె సాహితీ పురస్కార ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం త్యాగరాయ గానసభలో శుక్రవారం జరిగింది. ఎమ్మెల్సీ ఎస్. మధుసూదనాచారి పురస్కారం ప్రదానం చేసి మాట్లాడుతూ తెలుగు సాహితీ సౌరభాలను ప్రపంచానికి చాటిన మహనీయుడు సినారె అన్నారు. మౌనశ్రీ మల్లిక్ ఉత్తమశ్రేణి కవితా సంపుటులు వెలువరించి పలు పురస్కారాలు పొందారన్నారు. టీవీ ధారవాహికలు, సినీగేయాలు రాస్తూ మొత్తంగా వెయ్యి పాటల మైలురాయిని దాటడం గొప్ప విషయ మన్నారు. సత్య సంగీత వ్యవస్థాపక అధ్యక్షుడు ఓంకార్‌రాజు, కార్యదర్శి శైలజ, ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దైవజ్ఞ శర్మ, వంశీ రామరాజు, మహేష్‌కుమార్, సాధనాల వెంకట స్వామి, క్రాంతికృష్ణ, కల్పన ప్రసాద్ పాల్గొన్నారు.

## వ్యవహారిక భాషోద్యమకారులు

# గిడుగు రామమూర్తి పంతులు

**(ఆగస్టు 29, గిడుగు రామమూర్తి 152 వ జయంతి )**



-సబ్బని లక్ష్మీనారాయణ.
8985251271

తెలుగు భాషా సాహిత్యాల వికాసానికి కృషి చేసిన ముప్వురు శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు గారిని, శ్రీ గురజాడ అప్పారావు గారిని, శ్రీ గిడుగు రామమూర్తి గారిని తెలుగు జాతి సాహితీ వైతాళికులు అని అంటారు.

కందుకూరి వారి సంఘ సంస్కరణోద్యమము, గురజాడ వారి సాహిత్యంలో ఆధునికత, గిడుగు వారి వ్యవహారిక భాషా ఉద్యమముల గురించి విశేషంగా చెప్పుకోవాలి. ఏది ఊర్కే రాలేదు. రాదు. ప్రతిదీ ఒక ఉద్యమమే తొలి నాళ్ళలో. అది సంస్కరణోద్యమము సాహిత్యం ద్వారా.

పుస్తకములలో రాసే భాష గ్రాంథిక భాషలో కాక మనం మాట్లాడుకునే వ్యవహారిక భాషలో ఉండాలని పట్టుబట్టి, ఒక ఉద్యమం లా పనిచేసి దాన్ని సాధించినవారు గిడుగు రామమూర్తి గారు.

గిడుగు రామమూర్తిగారు ఆగస్ట్ 29, 1863వ సంవత్సరంలో శ్రీకాకుళానికి 20 కి.మీ. ల దూరం వంశధార నదీతీరంలో ఉన్న పర్వతాల పేటలో జన్మించారు. అతని తండ్రి వీర్రాజు గారు రెవెన్యూ ఇనస్పెక్టర్ గా ప్రభుత్వ ఉద్యోగం చేసేవారు. రామమూర్తి గారి 12 ఏండ్ల వయసులోనే వీర్రాజు గారు విషజ్వరం సోకి మరణించారు. అప్పుడు రామమూర్తి గారు వీర్రాజుగారి మేనల్లుడు కాళ్ళకూరి విశ్వనాథం గారి ఇంట్లో ఉండి విద్యాభ్యాసం కొనసాగించారు. విజయనగరం మహారాజ వారి కళాశాలలో రామమూర్తిగారు లోయర్ ఫోర్త్ లో ప్రవేశం పొందుతారు. అదే తరగతిలో చదువుకుంటున్న గురజాడ అప్పారావు గారి పరిచయం ఆ చిన్ననాడే ఏర్పడుతుంది. ఆ పరిచయం, స్నేహం వారిద్దరికి జీవితాంతం వరకు కొనసాగింది.

భాషా సాహిత్యాల వికాసం కోసం ఆ స్నేహం ఒక మార్గం అయ్యింది తెలుగు జాతికి. 1879లో ఇద్దరు మెట్రిక్యులేషన్ లో పాస్ అవుతారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల రీత్యా రామమూర్తిగారు ఉద్యోగంలో జాయిన్ అవుతారు. అప్పారావు గారు పై చదువులకు వెళ్తారు.

రామమూర్తిగారి వివాహం 1879 సంవత్సరంలో కందికొండ రామదాసు గారి రెండవ కూతురు అన్నపూర్ణమ్మతో జరుగుతుంది. తర్వాత రామమూర్తి గారు పర్లాకిమిడి మహారాజ వారి పాఠశాలలో ఫస్ట్ ఫారం ఉపాధ్యాయులుగా 1880లో చేరుతారు. జీతం నెలకు 30 రూపాయలు. రామమూర్తి గారు 1882వ సంవత్సరంలో ఎఫ్.ఏ. పరీక్ష ప్రైవేట్ గా రాసి పాస్ అవుతారు. అప్పుడు వారికి థర్డ్ ఫారమ్ టీచర్ గా ప్రమోషన్ దొరుకుతుంది. తర్వాత బి.ఏ. పూర్తి చేయాలన్న కోరికతో బి.ఏ. రెండు పార్టులను కూడా మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులవుతారు. అప్పుడు రామమూర్తి గారికి నాల్గవ ఫారమ్ టీచర్ గా ప్రమోషన్ వస్తుంది. వారి నెల జీతం 65 రూపాయలకు పెంచబడుతుంది. 1894లో పర్లాకిమిడిలోని మహారాజ వారి పాఠశాల అవ్ గ్రేడ్ తో కళాశాలగా మారబోతుంది అని తెలిసి దానిలో లెక్చరర్ ఉద్యోగం పొందడానికి అర్హత బి.ఏ. కాబట్టి, 1896 సండడలో మద్రాస్ విశ్వవిద్యా లయం నుండి బి.ఏ. పట్టాను ఫస్ట్ క్లాస్లో రెండవ స్థానాన్ని పొంది ఉత్తీర్ణులవుతారు. తర్వాత 1896లో అదే కళాశాలలో లెక్చరర్ గా పదోన్నతి పొందుతారు. రామమూర్తి పంతులు గారు విద్యార్థులకు చరిత్రతోపాటు ఇంగ్లీష్, సంస్కృతం, మానవీయ శాస్త్రం మొదలగు విషయాలు బోధించేవారు. రామమూర్తిగారి పర్యవేక్షణలోనే రామమూర్తి గారి కుమారులు గిడుగు సీతాపతిగారు, తండ్రి మార్గంలోనే విద్యనభ్యసించి, బోధనలోని మెలకు వలు తెలుసుకొని, టీచర్ ట్రైనింగ్ పూర్తిచేసి అదే కళాశాలలో ఉపాధ్యాయులుగా చేరుతారు. అప్పట్లో ఇంగ్లీష్ బోధన అంటే విశేషమైన విషయం. ఆంగ్లం నేర్పించడంలో నూతన బోధనా పద్ధతులను ప్రవేశపెట్టి విద్యార్థులకు సులభంగా ఆంగ్లం ఎలా బోధించ వచ్చో నిరూపించి పలువురి విద్యాధికా రుల మన్ననలు పొందారు గిడుగు వారు.

### గిడుగువారు సవరభాషకు చేసిన సేవ

రామమూర్తిగారు ఎక్కువకాలం పర్లాకిమిడి లోనే పని చేసారు ఉపాధ్యాయుడుగాను, లెక్చరర్ గాను. పర్లాకిమిడి పట్టణం ఎత్తైన కొండల మధ్య నున్న ప్రాంతం. పర్లాకిమిడి పట్టణ సమీప ప్రాంతాల్లోకి కొండల్లో సవర జాతివారు నివసించేవారు. కొండ ప్రాంతం నుండి కట్టె మోపులను తెచ్చి పర్లాకిమిడి అంగళ్ళలో అమ్మి జీవనం సాగించే వారు. సవరలు చదువురాని వారు, మోసపోతున్నారు ఈ నాగరిక సమాజంలో వారి శ్రమకు దగ్గ ఫలితం పొందలేకపోతున్నారు అని గ్రహించి, వాళ్లు విద్యావంతులుగా మారితే వాళ్ళ బతుకులు మారుతా యని తలచి ముందుగా సవరలతో పరిచయం పెంచుకొని సవరభాష నేర్చుకోవాలనుకున్నాడు. తెలుగు, సవర భాష తెలిసిన సవర 'పొట్టెడు' దగ్గర సవర భాష నేర్చుకున్నాడు. 1894 సం. లో సవరలను విద్యావం తులను చేయాలని, సవరల కోసం పాఠశాలలను స్థాపించాలని ప్రభుత్వానికి లేఖలు సమర్పించారు. ఐదుగురు చురుకైన సవర పిల్లలను ఇంట్లోనే పెట్టుకొని భోజన వసతులు కల్పించి వారిని సవర భాష బోధించడానికి ఉపాధ్యాయులుగా తయారుచేశారు. స్వయంగా సవర పిల్లల కోసం పర్లాకిమిడి తాలుకాలో సవర పల్లెల్లో పాఠశాలలు స్థాపించారు. సవర పిల్లలు విద్య నేర్చుకోవడానికి సవర భాష వాచకాన్ని స్వయంగా రచించారు. ఉపాధ్యాయులకు స్వయంగా జీతాలు కూడా ఇచ్చేవారు. ప్రభుత్వం వీరు చేస్తున్న సేవలను గుర్తించి అప్పటి బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం వారికి 1913 సం? జనవరి 1న 'రావు సాహెబు' అనే బిరుదును ప్రధానం చేసింది. వారు అలా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ 1911లో 33 సంవత్సరాల సర్వీసు పూర్తి అయినందున సర్వీసులోంచి రిటైర్ అయి వారి శేష జీవితాన్ని వ్యవహారిక భాషా ఉద్యమానికి కడదాక కేటాయిం చారు.

**హరిజనోభ్యుదయంతో స్వయంగా హరిజనుల కోసం సొంత ఖర్చులతో బడిని నెలకొల్పారు**

### శాసన పరిశోధకులుగా రామమూర్తి:

గిడుగు రామమూర్తి పంతులు గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. వారు సమాజ సేవకులుగా, వ్యవహారిక భాషోద్యమకారులుగానే కాకుండా శాసన పరిశోధకులుగా కూడా ప్రసిద్ధులు.

గిడుగు రామమూర్తిగారు ముఖలింగ గోడల మీద శాసనాలను పరిశీలించి చారిత్రక అంశాలను వెలికితీశారు. ఆ విశేషాలన్నింటిని ఒక వ్యాసం ద్వారా "యాన్ అకౌంట్ ఆఫ్ ది ఎంటిక్విటీస్ ఆఫ్ ముఖలింగం అండ్ ఇట్స్ నైబర్ హుడ్" పేర 'మద్రాస్ జర్నల్ ఆఫ్ లిటరేచర్ అండ్ సైన్స్' పత్రికలో ప్రచురించారు.

అలానే గోదావరి జిల్లాలోని రామచంద్రపురానికి ఐదు మైళ్ళదూరంలో ఉన్న కొంకుదురు శాసన ఫలకాలను పరిశీలించి, ఆ శాసనంలోని విషయాలను క్రోడీకరించి ఒక వ్యాసం రాసి 'ఎపిగ్రాఫియా ఇండికా' కు పంపడం వలన అది ఆ పత్రిక ఐదవ సంపుటిలో ప్రచురింపబడింది.

అలానే గంజాం జిల్లా కళింగ పట్టణానికి నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న దీర్ఘాసి గ్రామం శాసనంను పరిశీలించారు. అది పెద్ద రాతిఫలకం మీద ఉంది. ఆ శాసనంలోని వివిధ అంశాలను క్రోడీకరించి 'ఎపిగ్రాఫియా ఇండికా' నాల్గవ సంపుటిలో ప్రచురింప జేసారు.

### సంఘ సంస్కరణ వాదిగా గిడుగువారు:

గిడుగువారు పర్లాకిమిడిలో ఉపాధ్యాయునిగా ఉన్నప్పుడు, సామాజిక సమస్యలు కూడా పట్టించుకొని వాటి పరిష్కారములకు కృషి చేశారు. 'పర్లాకిమిడి'లో అప్పట్లో 'రీడింగ్ రూం' అనే సంస్థ ఉండేది. దానికి వారు కార్యదర్శిగా కూడా పనిచేశారు. కందుకూరి వారి సంఘ సంస్కరణలకు ప్రభావితులై గిడుగు వారు కూడా ఆ దిశలో తన సేవను అందించారు. 1928వ సంవత్సరంలో పర్లాకిమిడి బంకుపల్లి మల్లయ్య శాస్త్రిగారి కుమార్తె పది సంవత్సరాల వయస్సులోనే వైధవ్యం పొందితే, మల్లయ్యశాస్త్రిని ఒప్పించి ఆ అమ్మాయికి స్వయంగా తను, తన భార్య అన్నపూర్ణమ్మతో పెండ్లి పీటల మీద కూర్చుండి వేదుల సత్యనారా యణ శాస్త్రితో వివాహం జరిపిం చారు.

హరిజనోభ్యుదయంతో స్వయంగా హరిజనుల కోసం సొంత ఖర్చులతో బడిని నెలకొల్పారు.

కొండ ప్రాంతంలో అనాగరి కంగా నివసిస్తున్న సవర జాతికోసం, సవర భాషను నేర్చుకొని, సవరల కోసం సవర యువకులనే ఉపాధ్యాయులుగా తయారు చేసి, స్వంత ఖర్చులతో సవర పాఠశాలలు స్థాపించి, ప్రభుత్వం గుర్తించేటట్లు చేసి సవరల కోసం వాచకాలు, నిఘంటు వులు, ప్రయోగ దీపికలు తయారుచేసిన సేవాతత్పరులు గిడుగువారు.

### వ్యవహారిక భాషోద్యమకారులుగా గిడుగువారు :

వ్యవహారిక భాషావాదం ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని పుట్టింది. మనం నిత్యవ్యవహారాల్లో మాట్లాడుతున్న భాష, పుస్తకాల్లోని భాష వేరుగా ఉందని, అది గ్రాంథికవైౖ చదువరులకు, విద్యార్థులకు అర్థం చేసుకోలేనంత దూరంగా కష్టంగా ఉందని భావించి మనం మాట్లాడుతున్న భాషనే, మన కావ్యభాష కావాలని వారు తపించి కడదాక ఉద్యమంలా పనిచేసి దానిని సాధించిన మహానుభావుడు గిడుగు వారు. ఆ ఉద్యమంలో తనకు బాసటగా నిలిచినవారు, అలాంటి లక్ష్యంతోనే పనిచేసిన వారు 'కన్యాశుల్కం'లాంటి నాటకం వ్రాసి, 'దిద్దుబా టు' లాంటి కథలు రాసి, ముత్యాల సరముల లాంటి కవిత్వము రాసి తన అడుగులో, అడుగుగా నిలిచినవారు గురజాడ అప్పారావు గారే.

ఆనాటి కాలంలో గిడుగు వారిది ఒక మహాభాషా ఉద్యమం. ఆనాటి కాలంలో వ్యవహారిక భాషా ఉద్యమానికి బాసటగా నిలిచినవారు గురజాడ అప్పారావు గారు, పి.టి. శ్రీనివాస అయ్యంగారు, సెట్టి లక్ష్మీనరసింహం గారు, జె.ఏ. ఏట్స్, కిళాంబి రామానుజాచార్యులు, బుర్ర శేషగిరి లాంటి పెద్దలు. ఆనాటి ప్రముఖ గ్రాంథిక భాషావాదులు అయిన జయంతి రామయ్య పంతులు, వేదం వెంకట రాయశాస్త్రి, కొమర్రాజు లక్ష్మణరావు, వావికొలను సుబ్బారావు, కొక్కొండ వెంకటరత్నం పంతులు, రావు వెంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ లాంటి దిగ్గజాలను ఎదుర్కొంటూ వ్యవహారికంగా సామాన్య జనులు మాట్లాడే భాషను కావ్యభాషగా చేయడానికి కృషి చేసిన వారిలో అగ్రగణ్యులు శ్రీ గిడుగు రామమూర్తి పంతులు గారు.

వ్యవహారిక భాషాభివృద్ధికి కృషి చేస్తున్న ఆనాటి గిడుగు, గురజాడ, ఏట్స్, అయ్యంగార్లను గ్రాంథిక వాదులు దుష్టచతుష్టయంగా చిత్రించారు. "శిష్టుల వాడుక భాషకు 'గ్రామం' అని పేరు పెట్టారు. అది కులట దానిలో రాసిన రాతలు 'లంజ సంతతి', జి.వి. అప్పారావు, జి.వి.రామమూర్తి అన్న పేర్లలోని ఇంగ్లీష్ పొడి అక్షరాలను 'గ్రామ్యవా ది' (జి.వి.) అని గ్రాంథిక వాదులు వాఖ్యానించేవారు".

**వాచకాల్లో, పుస్తకాల్లో, సాహిత్యంలో వ్యవహారిక భాష ఉండాలని పట్టుబట్టి ఉద్యమంలా పనిచేసి దాని అమలుకు కృషిచేసిన ఆద్యులు గిడుగువారు.**

దీనిని బట్టి ఆనాటి గ్రాంథిక వాదులు, వ్యవహారిక భాషా ఉద్యమాన్ని ఎంతగా వ్యతిరేకించారో అనే విషయం అర్థం అవుతుంది.

ఆనాటి గ్రాంథికవాదులను ఎదుర్కొని నిలిచి వేర్వేరు ఊర్లలో వివిధ సాహిత్య సభలలో వ్యవహారిక భాషావాదాన్ని గూర్చి చెపుతూ, చిన్నయసూరికి పూర్వం తెలుగు గ్రంథాలలో ఎన్నియో వ్యవహారిక భాషలో రాసిన రచనలు ఉన్నాయని వాటన్నింటిని సేకరించి, వాటిని రాసుకొని, వాటిని ఎత్తిచూపుతూ వ్యవహారిక భాషా ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయారు గిడుగువారు. వ్యవహారిక భాషా ఉద్యమకారులు దాని ఆవశ్యకతను తెలుపుతూ ఎన్నియో కరపత్రములు ముద్రించి పంచినారు.

గ్రాంథిక భాషాభిమాని అయిన వీరేశలింగం పంతులు లాంటి వారు కూడా "రామమూర్తి చెప్పిన దానిలో మనము ఒప్పుకోక తప్పని అంశము లున్నవి, అతని వాదం నేడు కాకపోయినా కొలది కాలంలో జనసమ్మతం కాకా మానదు" అని చెప్పినారు. రామమూర్తి గారు తన వ్యవహారిక ఉద్యమ ప్రచారంలో భాగంగా పర్లాకిమిడి, బరంపురం, విజయనగరం, విశాఖపట్టణం, కాకినాడ, రాజమహేంద్రవరం, నెల్లూరు, మద్రాస్, గుంటూరు, మచిలీపట్టణం, అనంతపురం మొదలగు ప్రాంతాలలో కవి పండితులతోను, ఆయా ప్రాంతపు సభలు, సమావేశాలలో తన వాదాన్ని వివరించారు.

1924 అక్టోబర్ 9,10,11, 12,13 తేదీల్లో 'తణుకు'లో జరిగిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలో ఒకనాడు సుమారు 5 గంటలు వ్యవహారిక ఉద్యమమును బలపరుస్తూ ప్రసంగించారు రామమూర్తిగారు. ఆ సభల్లో ఆంధ్ర సాహిత్య పరిషత్తు వ్యవహారిక భాషకు సంబంధించి ఒక తీర్మానాన్ని చేశారు ఇలా : "గ్రామ్యం కాని వ్యవహారికాంధ్ర భాషలో బూర్వ సంప్రదాయం ననున రించి గ్రంథములు రచియించవచ్చునని యీ సభవారు. తీర్మానించుచున్నారు".

1924 నాటి వ్యవహారిక భాషావాద నికి ఇది ఒక గొప్ప విజయం అని చెప్పవచ్చు.

1933వ సంవత్సరంలో వ్యవహారిక భాషోద్యమ ఫలితంగానే 'నవ్య సాహిత్య పరిషత్తు' ఆవిర్భవించింది. వ్యవహారిక భాషలో రచనలు ప్రోత్సహించి, అందరికి అర్థమయ్యే సాహిత్యాన్ని అందించడం ఆ సంస్థ ప్రధాన ఆశయం. దాని మొదటి సమావేశాలు మార్చి 10,11,12 తేదీలలో 1933 సం?లో బరంపురంలో, 1933 డిసెంబర్ 29,30, 31 తేదీలలో రాజమహేంద్రవరంలో రెండవ సమావేశాలు జరిగినాయి. ఈ రెండవ సమావేశంలో గిడుగు వారి సప్తతి జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. 1938 సంవత్సరంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు రామమూర్తి గారి విశేష భాషా సేవలకు గుర్తింపుగా వారికి 'కళాప్రపూర్ణ' బిరుదునిచ్చి సత్కరించారు.

1937-38 సంవత్సరం మధ్యకాలం లో 'నవ్య సాహిత్య పరిషత్తు' పంచమ వార్షికోత్సవములు రామమూర్తిగారి అధ్యక్షతన జరిగాయి. రామమూర్తిగారి కండ్లముందే 1910-11ల నుండి 1937-38 వరకు వ్యవహారిక భాష వినియోగం, ఆమోదం విషయంలో ప్రజాదరణ పొందింది అనే విషయం స్పష్టమయ్యింది. ప్రభుత్వం వారును, విశ్వవిద్యాలయం వారును తన వాదనను ఇంకా అంగీకరించలేదని అసంతృప్తి మాత్రము ఉండెడిది.

1940 వరకు వారి 77 ఏండ్ల వయసులో వారి ఆరోగ్యం కొంత క్షీణించింది.

"నా వాదం అందరూ అంగీకరిం చలేదనిన్నీ, విశ్వవిద్యాలయం వారున్నూ, ప్రభుత్వ విద్యాశాఖ వారున్నూ, వ్యవహారిక భాషను గ్రహించలేదనిన్నీ నేనెరుగుదును. గాని, నా వాదము సరియైనదన్ని విశ్వాసం నాకు పూర్తిగా ఉండటం వల్ల ఎప్పటికైన ను తెలుగు వారందరూ నా వాదము పూర్తిగా అంగీకరించకపోరన్న నమ్మకం నాకు కలదు" అని తన మిత్రులతో అంటూ పత్రికల వారు, తమ వాదమును బలపరిచి ప్రభుత్వం వారున్ను, విశ్వవిద్యాలయముల వారున్ను ఆమోదించి గ్రహించునట్లు చేయవలెనని కోరుతూ తన తుట్టతుది సందేశంగా 16-1-1940న తెలియజేసి, తేది 22-1-1940వ తేదీన వారు పరమపదించారు.

వాచకాల్లో, పుస్తకాల్లో, సాహిత్యంలో వ్యవహారిక భాష ఉండాలని పట్టుబట్టి ఉద్యమంలా పనిచేసి దాని అమలుకు కృషిచేసిన ఆద్యులు గిడుగువారు. వారు సమాజసేవలో పాల్గొంటూ ముఖ్యంగా లిపి లేని సవర భాషకు లిపిని, భాషను, వాచకాలను, నిఘంటువులు ఇచ్చిన ఘనుడు గిడుగు వారు. వారి కలలు ఫలించిన తరుణంలో తెలుగువారి భాషా దినోత్సవం వారి జన్మదినం ఆగస్ట్ 29నే జరుపుకుంటున్నారు. తెలుగు వారికి ప్రాతస్మరణీయులు గిడుగు రామమూర్తి గారు.



# తక్కెడ పాఠం (కథ)

ఒకానొక పల్లెటూరిలో చెలమయ్య అనే ఓ అమాయకుడు ఉండేవాడు. అతని అమాయకత్వం ఎంతలా అంటే, ఎవరు ఏది చెప్పినా, అది నిజమా కాదా అని ఆలోచించకుండా వెంటనే నమ్మేసేవాడు. అతని ఈ అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని చాలామంది అతన్ని మోసం చేసేవారు.

అదే గ్రామంలో నాగభూషణం అనే కిరాణా వ్యాపారి ఉండేవాడు. ఇతను కేవలం వ్యాపారి మాత్రమే కాదు, పక్కా మోసగాడు. తూకాల్లో మోసం చేయడం, మాయమాటలు చెప్పి అమాయక ప్రజల నుండి డబ్బు గుంజడం వంటి అక్రమాలకు పాల్పడేవాడు. అంతేకాదు, అవసరం ఉన్నవారికి అధిక వడ్డీలకు డబ్బు అప్పిచ్చి ఊరిలోనే అత్యంత ధనవంతుడిగా మారాడు.

ఓ రోజు చెలమయ్యకు పంచదార అవసరమైంది. మూడు కిలోల పంచదార కోసం నాగభూషణం దుకాణానికి వెళ్ళాడు. చెలమయ్య పంచదార అడగ్గానే, నాగభూషణం తన ఎత్తుగడను అమలు చేశాడు. త్రాసులో ఒక పళ్ళెంలో ఒక కిలో బరువున్న పంచదారను, మరో పళ్ళెంలో రెండు కిలోల బరువున్న పంచదారను పోశాడు. సహజంగానే తక్కువ బరువున్న ఒక కిలో పంచదార పళ్ళెం పైకి లేచింది. ఇదే అదనుగా నాగభూషణం పైకి లేచిన ఆ ఒక కిలో పంచదారను చెలమయ్య సంచిలో పోశాడు. ఆ తర్వాత,

"మూడు కిలోలకు లెక్క సరిచేశాను, డబ్బులు ఇవ్వండి" అంటూ చెలమయ్య నుండి డబ్బులు తీసుకున్నాడు.

"నాగభూషణం, నువ్వు నాకు ఒక కిలో పంచదార మాత్రమే ఇచ్చావేంటి? నేను మూడు కిలోలు అడిగాను కదా?" అని చెలమయ్య అమాయకంగా అడిగాడు.

"చెలమయ్యా! అందుకే నిన్ను అందరూ వెర్రిబాగులోడివని ఆటపట్టిస్తారు. నీకు తెలియదా? తూకంలో పైకి లేచిన పళ్ళెంలోని వస్తువే గొప్పది! తెలివైన వాళ్ళు దానినే తీసుకుంటారు. అది అత్యుత్తమమైనది"

అని నాగభూషణం నవ్వుతూ, వెటకారంగా చెప్పాడు. నాగభూషణం మాటలను నమ్మిన చెలమయ్య,

"సరేలే, అలాగే. నేనూ తెలివైన వాడినే. ఊరికే నీతో సరదాకి అన్నాను,"

అని తన తెలివికి తానే మురిసిపోతూ ఆ ఒక్క కిలో పంచదారతో ఇంటికి చేరాడు.

ఇంటికి వెళ్ళిన తర్వాత, తెచ్చిన పంచదార తక్కువగా ఉండటాన్ని చూసి చెలమయ్య భార్యకు అనుమానం వచ్చింది.

"ఇదేంటి, ఇంత తక్కువ పంచదార తెచ్చావు? మూడు కిలోలు అన్నావు కదా?" అని అడిగింది.

జరిగినదంతా చెలమయ్య తన భార్యకు పూసగుచ్చినట్టు చెప్పాడు. నాగభూషణం తన భర్తను మోసం చేశాడని తెలుసుకున్న అతని భార్యకు కోపం నషాళానికి అంటింది. తన అమాయకపు భర్తను మోసం చేసిన నాగభూషణానికి తగిన బుద్ధి చెప్పాలని నిర్ణయించుకుంది.

"అతనికి బుద్ధి రావాలంటే, ముల్లును ముల్లుతోనే తీయాలి! అదే అతనికి సరైన గుణపాఠం అవుతుంది"

అంటూ ఒక తెలివైన ఉపాయాన్ని తన భర్తకు చెప్పింది. చెలమయ్య భార్య మాటలకు అంగీకరించి, సరేనని తల ఊపాడు. మరుసటి రోజు చెలమయ్య ధైర్యంగా నాగభూషణం దుకాణానికి వెళ్ళాడు.

"నాగభూషణం! నాకు ఇరవై వేల రూపాయలు అత్యవసరం. కేవలం ఒక్క రోజులో తిరిగి ఇచ్చేస్తాను, వడ్డీ కూడా చెల్లిస్తాను"

అని అడిగాడు. డబ్బులకు, అధిక వడ్డీకి ఆశపడిన నాగభూషణం, చెలమయ్య అడిగిన డబ్బు ఇచ్చి పంపాడు. తన డబ్బు సురక్షితంగా, వడ్డీతో సహా తిరిగి వస్తుందని ఆశించాడు. తరువాత రోజు, చెలమయ్య డబ్బు తిరిగి చెల్లించడానికి నాగభూషణం దుకాణానికి వెళ్ళాడు.

"ఇదిగో నీ డబ్బు," అంటూ, కేవలం రెండు వేల రూపాయలను నాగభూషణం చేతిలో పెట్టాడు.

"నీకేమైనా మతిపోయిందా? నువ్వు తీసుకున్నది ఇరవై వేలు, తిరిగిచ్చేది రెండు వేలా? ఇంత మోసమా?"

అని నాగభూషణం కోపంతో అరిచాడు. అతని ముఖం ఎర్రబడిపోయింది.

"మతిపోయింది నాకు కాదు, నీకే నాగభూషణం. కావాలంటే చూడు!"

అంటూ నాగభూషణం చేతిలోని రెండు వేల రూపాయలను తీసుకుని, అక్కడే ఉన్న త్రాసులోని ఒక పళ్ళెంలో వేశాడు. ఆ తర్వాత తన జేబులోని పద్దెనిమిది వేల రూపాయలను మరో పళ్ళెంలో వేశాడు.

చెలమయ్య ఆ విధంగా డబ్బులు పెట్టగానే, రెండు వేల రూపాయలు వేసిన పళ్ళెం పైకి లేచింది.

"చూశావా నాగభూషణం? తూకంలో పైకి లేచిన పళ్ళెంలోనిదే గొప్పదని నీవే చెప్పావు! అందుకే నీకు రెండు వేలు ఇచ్చాను. అది అత్యుత్తమమైనది కదా?"

అని చెలమయ్య నవ్వుతూ, నాగభూషణం మాటలనే అతనికి తిరిగి వినిపించాడు. తాను చేసిన మోసం తనకే ఎదురుదెబ్బ తీసిందని, తన సొంత మాటల వలలో తానే చిక్కుకున్నానని తెలుసుకున్న నాగభూషణం సిగ్గుతో తలదించుకున్నాడు. తన మోసం బయటపడిందని గ్రహించి, చెలమయ్యను క్షమాపణ కోరాడు. చెలమయ్య, నాగభూషణానికి మిగిలిన పద్దెనిమిది వేల రూపాయలను కూడా ఇచ్చి,

"నాగభూషణం! ఇకపై ఎవరినీ మోసం చేయవద్దు. నిజాయితీతో వ్యాపారం చెయ్యి. ప్రజల నమ్మకాన్ని గెలుచుకో. నిజాయితీగా సంపాదించిన డబ్బే నిలుస్తుంది"

అని బుద్ధి చెప్పి అక్కడి నుండి గంభీరంగా వెళ్ళిపోయాడు. ఆ రోజు నుండి నాగభూషణం తన తప్పు తెలుసుకొని, తన మోసపు అలవాట్లను మానుకొని నిజాయితీగా వ్యాపారం చేయడం ప్రారంభించాడు.

చెలమయ్య కూడా తన భార్య తెలివితో కేవలం అమాయకుడిగానే కాకుండా, తెలివైన, ధైర్యవంతుడైన వ్యక్తిగా మారి, మోసగాడికి తగిన గుణపాఠం నేర్పాడు.

ఈ సంఘటన ఆ గ్రామంలో చెలమయ్య పట్ల ఉన్న అందరి అభిప్రాయాన్ని మార్చివేసింది.



-డా॥పోతగాని సత్యనారాయణ
9182531202



## కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..
-సంపాదకులు

### కోరిక

మరు జన్మలోనైన ఊహ తెలియని పసి వయసులో..నా
కన్న తండ్రి కాలధర్మం చేయకుండ కరుణించమని కోరుకుంట.
అమ్మ కనుసన్నల్లోనే క్రమశిక్షణతో పెరుగుతూ
పసితనం నుండే శ్రమ విలువ నెరిగిన విధానం కోరుకుంట.
పోటీ పడి చదివి గెలుపుబాటలొ బాసిల్లుతూ
ఉత్తమ విద్యార్థిగా ఉపాధ్యాయులచే
ప్రశంసింపబడిన పరిమళాలు కోరుకుంట.
పరీక్షలంటే పండగ - పనంటే పరమానందంగా సాగిన
శ్రమైక జీవన సౌందర్యాన్ని మళ్ళీ ప్రసాదించమని కోరుకుంట.
బంధాలు, బాంధవ్యాలతో, ప్రేమానురాగాలతో గడిపిన
చిన్న నాటి చిరునవ్వులు ఇవ్వమని కోరుకుంట.
కష్టాలను మగరాయుడిలా ఎదుర్కొన్న అమ్మయొక్క
సమయ స్ఫూర్తి, ధైర్య, సాహసాలు ఇవ్వమని కోరుకుంట.
కడుపు కట్టుకొని ఆకలి తీర్చిన దైవం లాంటి అమ్మను,
సహనం, సహృదయురాలైన నా శ్రీమతిని
జన్మ జన్మలకు ఇవ్వమని కోరుకుంట.
సర్వ జనులకు సౌఖ్యాలు, సుఖశాంతులు అందిస్తూ..
ప్రపంచ శాంతి నెలకొల్పబడాలని కోరుకుంట.

- వడ్డేపల్లి నర్సింగరావు
+91 99599 45645

### మానసం

ముగ్ధ మనోహరమైన నీ రూపం
పురుషులకే మోహాన్ని కలిగించే నీ స్వరూపం
సృష్టిలోని సౌందర్యమంతా రాశీభూతమైతే
అది నీ రూపం
కలువ కొలనులో వికసించిన
పద్మ పత్ర నేత్రద్వయం నీది
నిన్ను చూడ పులకించె గాది సూనుని మానసం
సరయూతీరాన విశ్రమించిన వేళ
వెన్నెల విలాసం లాంటి
నీ చిరునవ్వు మోము ముందు నిలిచి
"కౌసల్యా సుప్రజా రామా"
అంటూ
దుష్టశిక్షణకై కర్తవ్య బోధ చేసె
నేడు నిన్నర్థిస్తున్నాను
వాడవాడలా రావణులు
ఊరు ఊరుకూ మారీచ సుబాహులే
రా స్వామి! మనసులో తిష్టవేసిన
అసుర ప్రవృత్తిని పారద్రోల
నాయకుడివై ఒకసారి రా స్వామి!

-యర్ర శ్రీదేవి
99591 94224

### తెలుగు రవికిరణం

తెలుగు తల్లి ముద్దు మాటలోనే వెలుగు,
మనసు మురిసే మాధుర్యంలోనే వెలుగు.
వాగ్గేయకారుల వీణ స్వరంలో వెలుగు,
వెదజల్లే వేద జ్ఞానంలో వెలుగు.
తెనుగు తల్లి తాళపత్ర గంధం వెలుగు,
కవులు కీర్తించిన కీర్తి గాథ వెలుగు.
పల్లె పొలాల్లో పసిడి గింజల వెలుగు,
నదీ తరంగాల నిత్య నృత్యాల వెలుగు.
విజయనగర వైభవ స్ఫూర్తిలో వెలుగు,
సత్యమూ సాహిత్య సౌరభంలో వెలుగు.
అక్షరమే ఆలయం అన్న భావంలో వెలుగు,
భావ గంగలో భాషా గౌరవంలో వెలుగు.
తెలుగు తల్లి చిరునవ్వు నిత్య దీప వెలుగు,
పసిపిల్ల పలికే మాటలో తొలి వెలుగు.
గీతం, గద్యం, గాథల గగనంలో వెలుగు,
ప్రేమ పల్లవించే పరిమళంలో వెలుగు.
ఎప్పటికీ ఎరగని శాశ్వత జ్యోతి వెలుగు,
తెలుగు తల్లి మనలో నిత్యం నిలిచే వెలుగు.

-రాజ్యలక్ష్మి శశిధర్.
+91 79817 84503

### సహస్ర హత్య

ఓ తల్లి దండ్రులారా!
కుటిల కుతంత్రపు కుటుంబ పెంపకమా..!
కోమలంగా పెరుగుతూ
విమలమైన బాలిక ఎలా శతృవాయే..
స్వతంత్ర భారతదేశంలో ఆడది
సబలగా చెప్పే అర్థాలు యేమాయే..?
పొరుగున ఆడపిల్ల నాలుగు గోడల మధ్య అబలగా హత్య..!
విశ్వగురువుగా ఎదిగే దేశ ప్రగతికి చేటు..!
సహస్రను కనిపెంచిన తల్లిదండ్రులకు కడుపు కోత !
మైనర్ బాలిక సహస్ర హత్య..!!
పక్కింటి మైనర్ బాలుడే హంతకుడు..
పథకం ప్రకారం బ్యాట్ కోసమా..!!
పరువు కోసం బాలిక హత్య..!!
వయసుకు మించిన ప్రణాళికలతో..!!
వడి వడిగా కత్తి పోట్లతో
పంచ ప్రాణాలు అనంత వాయువుల్లో..!!.
ఆధునిక మాధ్యమాల ప్రభావమా...
ఆకతాయిగా మారిన మైనర్ బాలుడు..!!.
సమాజానికి సెగల ఊసులూదిన
సంఘటన యిది ..!
ఇది నేరమనాలా లేక ల్యాబుల్లో పరీక్ష అనాలా!.
ఏమందునీ నేతి,మతి మాలిన దుర్భర,
దుస్సంఘటన చర్యను
రక్షణశాఖకు కొత్త పాఠాలు నేర్పిన
ఈ హంతకుని ఏమందును...
సభ్య సమాజం తలదించుకునే వీడిని ఏమందును
తోటి బాలబాలికల భవితకు సవాలక్ష సవాళ్లు..!!
తల్లిదండ్రులు తలదించుకునేలా తనయుడా బాలుడు..!
బాలనేరస్థుల జాబితాలో ఉంచుట సబబు... కాదు,
ఉరిశిక్షే సమాజానికి రక్ష!

-గూండ్ల నారాయణ
9441678733.

గ్రంథాలయాలు సమగ్ర వికాస సోపానాలు..

# అనంత సాగర్ లో రెండు పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో విద్యార్థులతో అతిథులు

ప్రతి గ్రామానికి ఒక చరిత్ర ఉంటుందని,అలాంటి చరిత్రను లిఖించి,పుస్తక రూపంలోకి తెచ్చి భావితరాలకు అందించాలని, అందుకు బాలలు సాహిత్య అభిరుచి పెంపొందించుకుని రచనలు చేయాలని, బాలల రచనలు ముద్రించడానికి చిల్డ్రన్ అకాడమీ సహాయం చేస్తుందని, ఉపాధ్యాయులు బాల సాహిత్యాన్ని ప్రోత్సహించాలని,రేపటి సమాజానికి ఉత్తమ పౌరులను అందించేది సాహిత్యమే నని , విద్యార్థులు ఎక్కువగా పుస్తకాలు చదవాలని, గ్రంథాలయము ను సద్వినియోగం చేసుకోవాలని బాల చెలిమి,దక్కన్ ల్యాండ్ సంపాదకులు మణికొండ వేదకుమార్ అన్నారు. గురువారం (21.08.2025) సిద్దిపేట జిల్లా చిన్న కోదూరు మండలంలోని అనంత సాగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వ్రాసిన "అనంత సాగర్ అక్షర కెరటాలు "అనే బాలల కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు ఆచార్యులు డా.రఘు ఏడవ తరగతి విద్యార్థి బి.విశ్వతేజ వ్రాసిన "విశ్వ తేజం " కథల పుస్తకాన్ని ఆవిష్కరించి " విద్యార్థులు చిన్న వయసులోనే కథలు వ్రాయడం అద్భుతమని,అది విద్యార్థుల సమగ్ర వికాసానికి ఉపయోగపడు తుందని, కథలు మన జీవన వికాసానికి సోపానాలు అని అన్నారు. ప్రధానోపాధ్యాయురాలు కోట జ్యోతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో భైతి దుర్గయ్య సంపాదకత్వంలో రూపొం దించిన పుస్తకాల ఆవిష్కరణ అనంతరం పాఠశాలలో బాల చెలిమి గ్రంథాలయాన్ని ప్రారంభిం చారు. పాఠశాలకు వందకు పైగా పుస్తకాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో బాల సాహితీ వేత్త గరిపెల్లి అశోక్, కథల తాతయ్య రాజమౌళి,తోట మధుసూదన్, గ్రామస్తులు ధర్మయ్య, కిష్టారెడ్డి, బాబయ్య, ఉపాధ్యాయులు శ్రీదేవి,సమ్మయ్య, నరేష్,దుర్గయ్య, వర్షారాములు, బాల చెలిమి ప్రతినిధులు విద్యార్థుల తల్లిదండ్రులు,యువకులు,సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

# కవిత్వ ప్రవాహంలో "రెండు ప్రేమల వాన"

పుస్తక సమీక్ష

ఆధునిక కవిత్వ క్షేత్రంలో కేతిరెడ్డి యాకుబ్ రెడ్డి గారిది ప్రత్యేకమైన శైలి.. ఐదు దశాబ్దాల జీవితాన్ని సాహితి అనుభవాన్ని అక్షరబద్ధం చేసి దానికి కాస్త ప్రేమను అద్ది రెండు ప్రేమల వాన రూపంలో కురుస్తున్నారు..కవిత్వ ప్రియులు, కవిత్వం రాయాలనే ఉబలాటం ఉన్న కొత్త తరం, కవిత పాఠకులు అందరూ ఈ ప్రేమ వానలో తడవాలిసిందే..తడిసి పులకరించాల్సిందే.. కవిత్వం పట్ల ఎంతో ప్రేమ కలిగిన యాకూబు రెడ్డి చూసిన ప్రతి దానిని వెంటనే కవిత్వం చేయాలనే ఆలోచన ఉన్నవారు కాదు. చాలా లోతైన పరిశీలన చేశాక అక్షరాలను అందమైన వాక్యంగా రూపు దిద్దుకునే వరకు నిరీక్షించే అరుదైన లక్షణం ఈ కవి సొంతం. జీవితాన్ని చాలా దగ్గరగా చూసి ఎన్నో మరపురాని సంఘటనలు, కుటుంబ సంఘర్షణలు, సమాజంలోని వైరుధ్యాలు, కులమత బేధాలు, మానవుడు అమానవుడుగా ,యాంత్రికంగా మారుతున్న నేటి పరిస్థితులలో మనిషి లో ఉండవలసింది మనిషి తనం మానవత్వం మంచితనం అదే తన కలం ఎజెండాగా భుజస్కంధాలపై వేసుకొని కవిత్వాన్ని ప్రేమిస్తూ కవిత్వంలో జీవిస్తూ కవిత్వాన్ని శ్వాసగా ధ్యాసగా భావిస్తూ మంచి సమాజాన్ని రూపొందించాలనే తలంపుతో తన కలాన్ని ,గలాన్ని కవిత్వం వైపు ఎక్కుపెట్టిన కవన కర్షకుడు .

తనకంటూ కొన్ని విలువలు ,నియమాలు సిద్ధాంతాలను ఏర్పరచుకొని కవిత్వం రాస్తున్న వారు చాలామంది ఉన్నారు కానీ ఈ కవి విశ్వ మానవ ప్రేమను వ్యక్తం చేయడము సమాజంలో జరుగుతున్న దారుణాలను ఖండించి నిక్కచ్చిగా నిలబడే మానవ గొంతుక కావడమే అంతిమ లక్ష్యమే ప్రతి కవితలో కనిపిస్తుంది. అమ్మ మీద ,అమ్మ ప్రేమ మీద, అమ్మ కష్టాన్ని మీద మాతృత్వం మీద అనేకమంది అనేక రకాల కవితా రూపాలను అమ్మ వైభవాన్ని విరివిగా రాశారు ఈ కవి అమ్మలేని లోటును, జ్ఞాపకాన్ని ఇలా అంటాడు..

**"అమ్మ జ్ఞాపకం వస్తే**
**చచ్చేంత కోపం వస్తుంది**
**దేవుడు పిలిచాడు**
**మళ్లీ వస్తానని చెప్పి**
**ఇప్పటికి కనబడలేదు....**
**.......**
**జ్ఞాపకంగా**
**ఓ ఫోటో నాయనా జేబులో పెట్టి పోవద్దు".**

బాల్యంలో తల్లి లేని లోటును ప్రతి పిల్లవాళ్ళు పడే వేదనను ఎంత అందంగా ఆర్ధ్రంగా హృదయాన్నీ పట్టి పిండిచేసే విధంగా రాశారు ..

నేటి సమాజంలో జరుగుతున్న మారణ హోమాలు మహిళలపై అత్యాచారాలు బాలికలపై లైంగిక వేధింపులు వాటి అన్నిటినీ ఖండిస్తూ ఈ కవితలో అంటాడు

**"నిద్రపోకు తల్లి నిద్రపోకు**
**నిద్రలో వచ్చే**
**కలలో కూడా కత్తులతోనే సంచరించు"**

అంటే ఇక్కడ ఆడవారి పట్ల సమాజంలో పెట్రేగి పోతున్న దారుణాలను అరికట్టడానికి చట్టాలు ఎన్ని వచ్చిన, నిర్భయ లాంటి చట్టాలు ఎన్ని చేసిన, మనిషి ఆలోచన సరళి మారనంత కాలం మనిషిలో మానవత్వం పరిఢవిల్లనంత కాలం ఆడవాళ్లు కత్తులతో సంచరించాల్సిందే అంటూ కర్తవ్యాన్ని ధైర్యాన్ని ఉద్బోధిస్తాడు.... కేవలం కంటి ముందు జరుగుతున్న దృశ్యాలను చూస్తూ ఊరుకునే కవి కాదు, సందర్భాన్ని బట్టి దిశా నిర్దేశం చేస్తాడు. కవి గారు మానవ విలువలకు ఎంత ప్రాధాన్యతనిస్తాడో స్నేహానికి అంతే ప్రాధాన్యతను ఇస్తాడని చెప్పడానికి ఈ పుస్తకాన్ని తన మిత్రుడు అయినటువంటి







ప్రతులకు:
కేతిరెడ్డి
యాకూబ్‌రెడ్డి
సెల్:9989584549.

చుక్కల సుదర్శన్ కు అంకితం ఇచ్చాడు.. ఈ పుస్తకానికి ముందుమాటగా దర్భాశయనం శ్రీనివాస్ గారు చక్కని ఆ ముఖంతో పుస్తకాన్ని సమగ్రంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. ఇందులో దాదాపు70 కవితలు ఉన్నాయి. ప్రతి కవిత, వస్తు వైవిధ్యంతో, భిన్న భావనలతో పాఠకులను ఆలోచింపజేసి రంజింప చేస్తుందని లో సందేహం లేదు.

ఒక కవి కవిగా రాణించాలంటే భాగస్వామి పాత్ర కూడా కీలకమే అందుకే ఆమె అనే శీర్షిక లో భార్య గురించి ఇలా అంటాడు..

**"ఆకలితో కూర్చున్న**
**పళ్లెంలో అన్నమైంది..**
**.....**
**విషాదం అలలై పైకి లేచినప్పుడు**
**చిరునవ్వుల నురగై కప్పేస్తుంది"**

అంటూ.. తన అర్ధాంగి గొప్పతనాన్ని, ఎంత పేదరికాన్ని అనుభవించిన, కష్టాల్లో బాధల్లో.. అండగా నిలిచిందనే సందర్భాన్ని అందమైన వాక్యంగా నిక్షిప్తం చేశారు.

**"రెండు ప్రేమల వాన"శీర్షికలో**
**×××**
**ఒకానొక పరిపక్వతలోంచి**
**ఓ కొత్త లోకానికి తండ్రిన య్యాక..**
**కాలం మంత్రజలాన్ని చల్లి తాతన చేస్తుందంటాడు."**

మనిషి బాల్యం నుంచి యవ్వనం, యవ్వనం నుంచి వృద్ధాప్యం రావడం ఎంత సహజమో వివాహము,పిల్లలు, పిల్లల పెళ్లిళ్లు కావడం కూడా సహజమే అనే విషయాన్ని ఈ కవితలో చక్కని బావుకతతో చెప్పారు.

"శతపత్ర పుష్పం.." ఈ కవితలో ఫ్యాను తిరుగుతున్నంతసేపు హాయిగా ఉన్న మనిషి ఒక్కసారి కరెంటు పోతే ఎలాంటి స్థితిని అనుభవిస్తాడో ఈ రెండు వాక్యాల ద్వారా కవి గాడత అర్థమవుతుంది.

**""అలా మీటనుక్కుతానో లేదో**
**ఆ మూడు రెక్కల శతపత్ర పుష్పమై వికసిస్తుందంటారు...**
**......**
**అది తిరుగుతున్నంత సేపు**
**ధ్యానముద్రలో మునిగిన నేను**
**ఆగిపోయిందా**
**తపు భంగమైన ఋషులవుతాను**

అంటాడు.... ఇలాంటి ఘాడతతో కూడిన కవితలు చాలా ఈ పుస్తకంలో కనిపిస్తాయి. కవిగా తాను ఎన్నడూ ఊహా లోకంలో విహరించకుండా యథార్థమైన విషయాలను అక్షరబద్ధం చేయడంలో చాలా కసరత్తు చేసినట్టుగా, కొన్ని కొన్ని కవితలలో కనిపిస్తా ఉంటుంది ముఖ్యంగా "విలోమరాగం" అనే శీర్షికన ఉన్న కవితను చూస్తే మనిషి తాలూకు జీవన మర్మాన్ని ఒక అద్భుతమైన భావనను పాఠకుడికి చేరవేయడంలో ఈ కవి విజయం సాధించాడు. ఇందులో షేక్స్పియర్ తాలూకు ఒక విషయం జ్ఞప్తికి వస్తుంది ప్రపంచం ఒక నాటకరంగం అందులో అందరూ వారి వారి పాత్ర నిర్వహించి నిష్క్రమించాల్సిందే అన్నారుగా అలాంటి ఆలోచన కలిగించే విధంగా ఈ కవిత నడుస్తుంది..

"విశ్వ వేదిక మీద తెర
ఎవరూ తొలగించకుండానే తెగి పడుతుంది.. ఈ రెండు వాక్యాలలో మనిషికి మరణం అనివార్యం అనే విషయాన్ని చాలా లోతుగా విశ్లేషిస్తారు కవి. పుట్టుక మొదలు చావు వరకు మనిషి తాను చేస్తున్నటువంటి పోరాటాలు ఆరాటాలు ఆవేదనలు సంవేదనలు అనుభూతులు ఇట్లాంటి అన్ని విషయాలను తెలుసుకునే లోపే మెదళ్ళ గడ్డాలు తెల్లబడుతాయి. అంటూ జీవన సత్యాన్ని చెబుతాడు.

ఈ కవి ఈ రెండు ప్రేమల వాన కవితా సంపుటి రూపుదిద్దుకోవడానికి దాదాపు దశాబ్దకాలం పట్టింది అంటే ఇక్కడే మనం అర్థం చేసుకోవచ్చు కవి తాను ఎంత ఘర్షణ పడి , కవిత్వ వాక్యాన్ని పాఠకునికి చేరవేయడంలోను, రసానుభూతిని కలిగించడం కొరకు ఎంత సమయం వేచి ఉన్నాడో అర్థమవుతుంది.. ఈ కవితా సంపుటిలో ప్రతి కవిత చదివించేలా చేస్తుంది. కాబట్టి కవితా ప్రేమికులు తప్పకుండా ఈ పుస్తకాన్ని చదివి ఆ కవిత్వం యొక్క రసానుభూతిని పొందగలరని ఆశిస్తున్నాను....



-నాగరాజు మద్దెల
6301993211.

పుస్తక సమీక్షలు

# భావాల లయలు - రుబాయీ సుధలు!!

ఉర్దూ కవితా ప్రక్రియ అయిన రుబాయీలు గతంలోనే ఎంతో ప్రసిద్ధి పొందినవి. గజల్ ఛందస్సుతో కాఫియా... రదీఫ్ లు లేదా అంత్య ప్రాస సమాన మాత్రలు తో ఒక లయ కలిగిఉంటాయి. అనేక మంది కవులు స్వీయ నిర్మాణ నైపుణ్యంతో వేదాంతము, ప్రేమ, విరహం, లౌకిక వ్యవహారాలు, వైరాగ్యం, భక్తి వంటి అనేక అంశాలతో వ్రాసిన రుబాయిలు గజల్ల లాగే గాన యోగ్యత కలిగి ఎంతో ఆదరణ పొందినవి.

నేడు అనేక మంది కవులు తిరిగి అదే ప్రక్రియను తమదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో వ్రాయడం ముదావహం.

వాటిలో శ్రీ ఏనుగు నరసింహా రెడ్డి గారి సామాజిక రుబాయిలు అద్భుతమైనవి. అలాగే ప్రబంధ నాయికలు అని కొత్త ఒరవడితో శ్రీ పొర్ల వేణుగోపాలరావు గారూ పుస్తకంగా ప్రచురించారు.

మహతీ సాహితీ కవి సంగమం సమూహంలో శ్రీ అడిగొప్పుల సదయ్య గారు వందరోజుల కవితా పండుగ అంటూ రుబాయిలకూ ఓ రోజు కేటాయించడం జరిగింది. సమీక్షకులుగా నేను (ఎం. వి.ఉమాదేవి) అందరి రుబాయిలు చదివి సమీక్ష, సవరణలు చేసినవే కొందఱు పుస్తకంగా ప్రచురణ చేసుకున్నారు. వాటిలో శ్రీమతి జూపూడి సుధారాణి గారి రుబాయిలు చక్కని నియమాలు, సరికొత్త భావాలతో వ్రాసిన రుబాయిలు చాలా బాగున్నాయి. త్రిశ, ఖండగతి, చతురస్ర, మిశ్రగతి ఇలా అన్ని రకాల గతుల్లో , వివిధ అంశాలలో సుధారాణి అద్భుతంగా వ్రాసారు. మొత్తంగా 358 రుబాయిలను వ్రాసి ప్రచురణ చేయడం ప్రశంసనీయం!

ప్రథమ రుబాయీనే మన మాతృభాష తెలుగు గురించి,పూలలోని సుకుమారము పొదువుకుంది **తెలుగుభాష/ తేనె లోని మాధుర్యం ఒంపుకుంది/ అచ్చులతో ఆత్మీయత హల్లులతో హాయినిచ్చె/ అమ్మ లోని ప్రేమ నంత నింపుకుంది** అని అత్యంత సహజంగా వ్రాసారు.

ఖండగతిలో...

**బ్రతుకనే సరస్సున బంధాలు విరిసాయి/ మమతలను గంధాలు మనసులకు అద్దాయి/ మంచినే నీడగా/ ధైర్యమే తోడుగా/నడిపించి భవితకే మార్గాన్ని చూపాయి/**

ఈ రుబాయి అలతి పదాలే అయినా ఖచ్చితమైన భావన అనిపిస్తోంది. ఇక్కడ సంపదలు గురించి ఒక్క మాట కూడా అవసరం లేదు. అయినా రచన పరిపూర్ణ విషయంలో ఉంది.

త్రిశ్రగతి...

**వెదురుకేవెు మురళిలాగ మారాలని ఆరాటం/గాలికేవెు వేణువులో ఒదగాలని ఆరాటం/ ఆనందం రాగాలుగ మారుతున్న వేళలోన/ హృదయగళం పరవశించి పాడాలని ఆరాటం/**

నాలుగు పంక్తులలో యెంత సరళ కవిత్వం చూడండి! శ్రామిక వర్గానికి దన్నుగా కూడా వ్రాసిన రుబాయీ చాలా బాగుంది శ్రమధారలు కురుస్తున్న బ్రతుకు పంట పండదేమి?/కష్టాలను కడిగిననూ గుండె బరువు తగ్గదేమి... చివరి మలుపు చేరుతున్న మనిషి ఆశ చావదేమి అని కొస మెరుపు చూపారు కవయిత్రి.

**భక్తి వత్తి (దివ్వె)వెలుగుతోంది/ హృది కోవెల తలుపుతియ్యి/కనుల ఆర్తి పొంగుతోంది నీ పాదం కడగనియ్యి/ ప్రాణ వీణ తుదిగీతం పాడుతోంది చూసి వెళ్లు/ నీ సేవను చేసేందుకు నా ఆత్మకు అనుమతియ్యి...** అనే నివేదన హృద్యముగా ఉంది.

**నీ తత్వం నాకేదో చెప్పాలని**





ప్రతులకు
జూపూడి సుధారాణి
8341524905

**అనుకుందా?/ఆ భావన నా కన్నులు తెరవాలని అనుకుందా?/నీవెదుటే నిలిచిననూ ఎరుగలేని మందమతిని/ నీ మార్గం నా గతినే మార్చాలని అనుకుందా/** అంటూ ఆత్మ విమర్శ బాగుంది.

**చలువపూల పందిరిలో మనసంతా విచ్చుకుంది/ప్రేమ కథల పుటల లోని మధువంతా తెలుసుకుంది/ చితిలోనూ చిరునవ్వులు రువ్వేనేల నా పెదవులు?/ అంతమనే ఊహ లేక ఒక ఆత్మగ మారుతోంది...** అంటున్నారు వైరాగ్య రుబాయిలో.

**కాలంతో నడకలేల మంచిచేస్తూ మరలిపో/నలుగురితో నవ్వులేల గమ్యపు దిశ మార్చిపో/మానవతకు బానిసవౌ్ మరణానికి భయపడకోయ్/మారాలని మాటలేల కలము పట్టి రాసిపో!/** అని హెచ్చరిక చేశారు.

**గుండెల్లో ధైర్యమే కనుల కరిగి జారిందా/కండల్లో బలమంతా జావగారి పోయిందా/పండించే రైతు రాజు ఆశలకే తూట్లు పడెను/ బతుకులకే తెగులుసోకి నడిమధ్యన ఆగిందా/**అంటూ రైతుల ఆత్మహత్యల దయనీయత గురించి వ్రాశారు.

వెన్నెలమ్మ పాన్పుపైన చందురునికి కథలు పుట్టె/ మల్లెలమ్మ ఒడిలోనే యవ్వనుడే మనసు చుట్టె/ స్మృతుల వీణ మోగుతుంటే విరిసిందో హరివిల్లె/ ఆశలమ్మ తోటచేరి గిజిగాడే గూడు కట్టె/ అని సరదాగా ప్రణయ రుబాయిలు వ్రాశారు.

గృహకృత్యాలలో పెద్ద కుటుంబంలో తీరిక లేకుండా వున్నా సాహితీ వేదికల్లో వ్రాస్తూ ఉన్న సుధ గారికి అభినందనలు.

చూడ చక్కని ముఖ చిత్రంతో తపస్వి మనోహరం పబ్లిషర్స్ వారితో ముద్రించబడిన ఈ పుస్తకానికి ముందుమాటలు శ్రీ సదయ్య గారు, డా. రావి రంగారావు గారు వ్రాస్తూ కవయిత్రి ప్రతిభా పాటవాలకు మనఃపూర్వక అభినందనలు తెలిపారు. తన సాహితీ విజయం కారకులైన మాతృమూర్తికి,ప్రోత్సహిస్తున్న శ్రీవారికి తన పుస్తకాన్ని అంకితమివ్వడం బాగుంది!



-యం.వి.ఉమాదేవి
7842368534








కిన్నెర ఆర్ట్ థియేటర్స్ &
మాతృభాషా సమితి-ఆహ్వానం
తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా
డా॥ సగిలి సుధారాణిగారు
సంపాదకత్వం వహించిన
ప్రాచీన తెలుగు
మార్గాన్వేషణ-పరిష్కరణ
శాసనాలు-నాణేలు-తాళపత్రాలు- లిపి
గ్రంథావిష్కరణ
శుక్రవారం 29-8-2025, సా॥ 5:30 గంటలకు
తెలంగాణ సారస్వత పరిషత్, తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్

ముఖ్యఅతిథి : శ్రీ యన్. రామచంద్రరావు
అధ్యక్షులు, భారతీయ జనతాపార్టీ, తెలంగాణ
అధ్యక్షులు : డా॥ కె.వి.రమణ, ఐఎఎస్ (రి)
పూర్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
సభాప్రారంభకులు : ఆచార్య వెలుదండ నిత్యానందరావు
ఉపాధ్యక్షులు, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం
విశిష్ట అతిథి : శ్రీ యం. నాగేశ్వరరావు, సంపాదకులు, ఈనాడు ఆంధ్రప్రదేశ్
ఆత్మీయ అతిథి : డా॥ శ్రీరంగాచార్య, ప్రముఖ సాహితీ వేత్త
గౌరవ అతిథి : డా॥ చింతపల్లి వసుంధరా రెడ్డి
మాతృభాషా సమితి అధ్యక్షురాలు

సాంస్కృతిక కార్యక్రమం : సా॥ 5:30 నుండి 6-30 వరకు నృత్య కిన్నెర సమర్పించు
మా తెలుగు తల్లికి మల్లెపూదండ కూచిపూడి నృత్య రూపకం
నృత్య దర్శకత్వం: హంస పురస్కార గ్రహీత, కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కార గ్రహీత
డా॥ మద్దాళి ఉషాగాయత్రి
రచన : శ్రీ బ్నిం సంగీతం: శ్రీమతి వెంపటి శ్రీవల్లి శర్మ

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు, కిన్నెర
ఎస్.ఎస్. రాజు గౌ॥ అధ్యక్షులు, మాతృభాషా సమితి
మద్దాళి రఘురామ్ కార్యదర్శి, కిన్నెర

## అందమంటె ఏమిటే చెల్లెలా?

అందమంటె ఏమిటే చెల్లెలా
సౌందర్యమంటె ఏమిటే చెల్లెలా ॥అంద॥
పొట్టిగుంటె అందమా
ఎత్తుగుంటె అందమా
ఎఱ్ఱగుంటె అందమా
కఱ్ఱగుంటే అందమా
తెల్లగుంటె అందమా చెల్లెలా
నల్లగుంటె అందమా చెల్లెలా ॥అంద॥
ఒళ్లంతా టేపులతో
కొలతలేసి లెక్కలేసి
అర్థ నగ్న ప్రదర్శనలు
ఆరబోస్తు విందుచేస్తె
అందాలా భామలా చెల్లెలా
విశ్వానికి సుందరుల చెల్లెలా ॥అంద॥
మందంగా మేకప్ వేసి
అందంగా వున్నమంటె చ
మండెటి ఎండలోన
మట్టి తట్ట మోయమను
కారిన ఆ చమటలు చెల్లెలా
కడ్గేసును ఆందాలను చెల్లెలా ॥అంద॥
సౌందర్య సరుకులను
ప్రపంచ సంతలోన
అమ్ముకోను బొమ్మతీరు
వాడుకునె పోటి ఇది
తల మీద కిరీటంతో చెల్లెలా
వెల నిర్ణయం జర్గునే చెల్లెలా "అంద".
కొడలి బట్టి కోత కోస్తె
గడ్డి మోపు మోత మోస్తె
నడుం వంచి కల్పు తీస్తె
ఇంట బైట పనులు చేస్తె
కష్టంలో ఆ అందాలు చెల్లెలా
కారి కాల్వలయితాయే చెల్లెలా ॥అంద॥
ప్రపంచ మార్కెట్టు
పన్నినట్టి వల ఇది
ఒక్కొక్కా దేశంలో
ఒక్కక్కరిని గెలిపించి
ఆ దేశాలను దోచుకునె చెల్లెలా
పెద్ద దగా మోసం కుట్ర చెల్లెలా ॥అంద॥
అవనిలోన ఆడదే
అందానికి చిరునామా
శ్రమిక జన సౌందర్యం
అందంకన్న మిన్నలేదు
పెట్టుకున్న అందం కన్న చెల్లెలా
పుట్టుక అందం మిన్ననె చెల్లెలా ॥అంద॥
పోటీలు బూటకము
జడ్జిమెంట్ నాటకము
ముందుగానె నిర్ణయించి
మంది ముందు ప్రకటిస్తరు
అందాల పోటీలు చెల్లెలా
బూటకము నాటకమే చెల్లెలా ॥అంద॥



– ఉప్పెన
సెల్:8106073661

## వర్షం

సన్నగా కురుస్తున్న వర్షం చినుకులు
నీలాల నింగిని వీడి నేలపై చేరి
మైదానాలని తడుపుతూ
కొండకోనల్లో పాయలు పాయలుగా పారుతూ
సెలయేళ్ళుగా మారుతూ గలగల సవ్వళ్ళతో అలరిస్తూ
నదుల్లోకి చేరుతూ జలసిరులతో ప్రాజక్టులు సరికొత్త అందాలని
సంతరించు కోవడానికి కారణమవుతాయి!
సన్నగా కురుస్తున్న వర్షం చినుకులు
చెట్లన్నీ ఆకుపచ్చ వర్ణాలని సంతరించుకునేలా మరింత అందంగా
మెరిపించేలా తలంటుపోస్తూ తరిస్తుంటాయి !
సన్నగా కురుస్తున్న వర్షం చినుకులు
ఆకాశం లో విరిసిన ముచ్చటైన హరివిల్లును
నేలకి పరిచయం చేస్తూ దోబూచులాడుతుంటాయి !
సన్నగా కురుస్తున్న వర్షం చినుకులు
గగనసీమలో నుండి దేవతలు పన్నీటిజల్లులు చల్లుతున్నట్లుగా
జనుల మేనిని మెత్తగా అల్లుకుంటూ తన్మయాన్ని కలిగిస్తుంటాయి !
కోవెల కొలనులో చేరిన వర్షం చినుకులు కొలనంతా నిండి
భగవంతుడిని దర్శనం కోసం చక్రస్నానం కోసం తపస్సుచేస్తుంటాయి !
వర్ష చినుకులు వినిపించే సరాగాలు భగవంతుడి
హృదిని మెప్పించే
భక్తిపూర్వక అనిర్వచనాలు ..లోకహితాలు !



–గొర్రెపాటి శ్రీను
చరవాణి: 9652832290

## దిగులు బావి

అతడు బాధల తట్టను నెత్తిన ఎత్తుకొని
దినమంతా మట్టితో ముచ్చటిస్తాడు
సదా సమస్యల కొలిమిలో కాలిపోతూ
చెదిరిన కలల బూడిదను రాల్చుతుంటాడు
చెమట చుక్కలను అంగట్లో అమ్ముకుంటూ
బత్కు బండిని భారంగా లాగుతుంటాడు.
ఒకే గర్భ గుడి మా ఇద్దరికి ఊపిరి పోసినా
అక్షరాలు నా బత్కుని పచ్చని పైరుని చేస్తే
తమ్ముని లైఫ్ ని ఎండిన ఏటిగడ్డ జేసినయ్
తనని ఈడ్చుకెల్లి నేను బడిలో ఇడ్సిపెట్టినా
లంగా సవాసాలు మోపుజేసుకొని ఊరేగి
గోవ కఱ్ఱ , తాళ్ళకు తన తనువుని తాకట్టు పెట్టాడు.
పేర్చుకున్న ఆశలన్నీ పెలుసులుగా రాలి
గాజు వక్కలై రోజు నా గుండెకు గుచ్చుకుంటూనే ఉన్నాయి
ఇప్పుడు నాన్న ఇచ్చిన వారసత్వపు తాపీ
తన ఎండిన పేగులకు ఎనగఱ్ఱై నిలబడ్తాంది
ఇప్పుడు రుతువులన్నీ తమ్ముని పెయ్యి మీదనే
పేరిణీ నృత్య మాడుతున్నాయి.
తన జీవితంలోకి ఆమె వసంతమై వచ్చినా
తన బత్కు ఈసమంతైనా ఇగురు పడ్తాలే
వాడి కడుపులో రెండు కాయలు కాసి తన మనసును
ఇంకా దిగులు బావిలోకి నెట్టింది
తను కాసుల కత్తెరలో ఇరుక్కున్నప్పుడల్లా
నేను ఊత కఱ్ఱై ఊపిరి పోస్తూనే ఉన్నాను.
తమ్ముడి బతుకు ఒక యుద్ధం లా మారింది
అతను అలసిపోని సైనికుడై శ్రమ ఆయుధాన్ని తిప్పుతూనే ఉన్నాడు
కాలం చెబుతున్న పాఠాలను నేర్చుకుంటూ
సంసార సాగరాన్ని ఈదుతున్నాడు
అవమానాల గరళాన్ని కంఠంలోనే దాచుకుంటూ
మౌనమునిలా సాగుతున్నాడు



–తాటిపాముల రమేశ్
7981566031

## శరభయ్య సుగుణం



నరసింహపురంలో శరభయ్య వ్యాపారం చేసేవాడు. అతనిది ఒక కిరాణా దుకాణం. ఆయన కొత్తగా ఒక నౌకరును పెట్టుకున్నాడు. ఆ నౌకరు ప్రతిరోజు బఠానీలు తీసుకొని నోట్లో వేసుకొని చాటుగా నమిలేవాడు.

ఒకసారి శరభయ్య ఆ బఠానీల సీసాను చూశాడు. అందులో ముప్పావు వంతు బఠానీలే ఉన్నాయి. తనకు తెలిసినంతవరకు నిన్ననే ఆ సీసా నిండా బఠానీలను పోశాడు. ఒక్కరు కూడా వాటిని కొనుక్కొని తీసుకొని పోలేదు. అతనికి తన కొత్త నౌకరు మీద అనుమానం వచ్చింది. కానీ తాను స్వయంగా కళ్ళతో చూడనిదే అలా అనడం మహాపాపమని ఆయన ఊరుకున్నాడు.

మరొకరోజు ఆ సీసాలోని బఠానీలు ఇంకా తగ్గాయి. శరభయ్య అనుమానం నిజమైంది. ఆరోజు తన నౌకరు ఆ సీసాలోని బఠానీలను తీసి నోట్లో పోసుకోవడం శరభయ్య రహస్యంగా చూశాడు. వెంటనే ఆయన "చూడబ్బీ! ఏ వస్తువైనా అడిగి తీసుకోవాలి . అడగకుండా తీయడం చాలా తప్పు" అని అన్నాడు. అప్పుడు ఆ నౌకరు "అయ్యా! మీరు ఎవరి గురించి అంటున్నారో నాకు బోధపడడడం లేదు. నాకైతే అలాంటి బుద్ధి లేనే లేదు" అని బుకాయించాడు.

"అప్పుడు శరభయ్య ఇంకెవరినీ? నిన్నే! నీవు ఈ బఠానీలను సీసాలోంచి తీసి నోట్లో పోసుకునే టప్పుడు నేనే స్వయంగా చాటునుండి గమనించాను. అందుకే అలా అంటున్నాను" అని అన్నాడు. అప్పుడు నౌకరు కోపంతో "మీరు కావాలని నన్ను ఇలా అంటు న్నారు. మీ బఠానీలు నేను ఎందుకు తీస్తాను?" అని అన్నాడు. "అయితే మరి సీసాలోని బఠానీలు ఎలా మాయమవుతున్నాయి?" అని ప్రశ్నించాడు శరభయ్య. "ఏమో! నాకేం తెలుసు? సేరే ఎవరైనా తింటున్నారేమో!" అని అన్నాడు నౌకరు. "అదేం కాదు. నువ్వు బఠానీలు సీసాలో నుండి తీయంగ నేను నా కళ్ళతో స్వయంగా చూశాను . ఇప్పుడు అవి నీ జేబులో ఉన్నాయి కూడా! ఏదీ నీ జేబు చూపు" అని గద్దించేసరికి ఆ నౌకరు ఉలిక్కిపడ్డాడు.

" అయ్యా ! నన్ను క్షమించండి. మరొకసారి మిమ్మల్ని అడిగే ఈ బఠానీలను తీసుకుంటాను. నాకు ఇవంటే చాలా ఇష్టం ! మీకు తెలియకుండానే వీటిని తీసుకొని తినడం నా తప్పు. దయచేసి నన్ను ఈ పనిలో నుండి తొలగించకండి. మా కుటుంబానికి నేనే ఆధారం. మరోసారి ఇలాంటి చెడ్డపని చెయ్యను" అంటూ ఏడుస్తూ చెప్పాడు. అప్పుడు శరభయ్య "చూడు బాబూ! పశ్చాత్తాపాని కన్న మించినది లేదు. నన్ను ముందే అడిగితే నేనే ఆ బఠానీలను నీకు ఉచితంగా ఇచ్చేవాడినిగా! ఇలా చేయడం వల్ల నీకు అపకీర్తి తప్ప మంచి పేరు రాదు. ఈ సంగతి తెలిస్తే ఎవ్వరూ నిన్ను పనిలోకి కూడా తీసుకోరు" అంటూ అతన్ని పెద్ద మనసుతో క్షమించి విడిచిపెట్టాడు. అంతేకాదు! అతనికి కొన్ని బఠానీలు తెప్పించి ఉచితంగా ఇచ్చాడు కూడా! ఈ విషయం తెలుసుకున్న ప్రక్క దుకాణాదారులు శరభయ్య సుగుణాన్ని మిక్కిలి ప్రశంసించారు.



–సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

# సహప్రయాణి

కథ



–లక్ష్మణరావు పతంగే
సెల్:92900 79047

ఎండాకాలం తాతీల్లొచ్చినయి. మా ఊరికిపొయి గాణ్ణే ఉండాలనుకున్న. ఓ రోజు రైలు రిజర్వేషన్ చేసుకొని బయిలెల్లిన. మా ఊరు పల్లెటూరు. చుట్టూ కొండలు. చిన్న చిన్న వాగులు వంకలు. పచ్చని చెట్లతోని అందంగుంటది. ఊళ్ళో ఉండే ఆత్మీయత ఎక్కడా కన్పించదు. ఆ జనం ఆ బాస ఆ యాస గా మాటామంతి. వరుసలతో పిల్చుకొనుడు యాదికొస్తే రెక్కలు గట్కోని ఊళ్ళె వాలాలనుకునేవాణ్ణి. నా సూట్కేసు తీస్కోని అఱ్ఱకు తాలమేసి బయటికొచ్చిన. రిక్షా కోసం ఎదురు సూడబట్టిన. సడక్మీద దూరంగ ఓ రిక్షోడు నా దిక్కు రావడం కన్పిచ్చింది. చెయి ఊపి సైగ చేసి పిల్చిన.

"ఏయ్ రిక్షా, చల్తే క్యా"
"కహాం జానాహై సాబ్"
"నాంపల్లి స్టేషన్"
"కిత్తే సవారి సాబ్"
"మైం అకేలా హీ హూం"
"చార్ రుపియే దోసాబ్"
"మైం అకేలా హూంన తీన్ రూపియె లేలో"
"ఠీక్ హై సాబ్! బైఠియే" అన్నడు.
"జరా జల్దీ చలో! రైల్కా టైమ్ హెూ రహాహై"
"ఠీక్ హై సాబ్"

రిక్షా నాంపల్లి టేషన్కాడ ఆగింది. వానికి పైసలిచ్చి లోపల్కి పొయ్యిన. టికెట్టు తీస్కోని రైలెక్కనీకె పోతే అప్పుడే రైలు కదిలి ఫ్లాట్ఫారం దాటి పొయ్యింది. తిర్గి కౌంటర్కాడ్కి పొయి, "సార్ రైలెల్లిపొయ్యింది. మళ్ళీ ఎప్పుడున్నది" అని అడ్గితే రాత్రి పదకొండు గొట్టంగ అన్నడు. గడియారం చూస్తే ఎనిమిదే అయితున్నది. ఇంకా మూడు గంటలు ఎట్ల గడపాల్నా అని కెంటీన్లకు పొయి సమోసాలు తిని చాయ్ తాగి ప్లాట్ఫారం బెంచిమీద కూసున్న. ఏం తోస్తలేదు. రైల్వే టేషన్ల ఉన్న షాప్కాడ్కి పొయిన. ఏమన్న పుస్తకాలు దొర్కుతయ్యేమోనని. 'విచిత్ర కథలు' అనే పుస్తకం కన్పిచ్చింది. దాన్ని రూపాయి యిచ్చి కొనుక్కోని తిరిగి బెంచిమీద వొచ్చి కూసున్న. గాచిన్న చిన్న కథలు శాన బాగున్నయి. సద్వుతుంటే టైమే తెల్వలేదు. రైలొస్తున్నదన్కుంట. జనం అటూ ఇటూ పరుగులు తీస్తున్నరు. హమాలీలు బండ్లు తోస్కుంట పోతున్నరు. వాటి సప్పుడు దడదడ మన్కుంట టేషనంత ఇన్పిస్తున్నది. కతల పుస్తకాన్ని చేతి సంచిల పెట్కోని సూట్కేసు తీస్కోని నిలబడ్డ. రైలొచ్చి ఆగింది. ఎదురుంగున్న డబ్బాలకెక్కి కూసున్న. రాత్రి కాబట్టి జనం ఎవల్లు లేరు. అక్కడొక్కరు ఇక్కడొక్కరు కూసున్నరు. డబ్బంతా ఖాళీగా ఉన్నట్లే అన్పియ్యబట్టింది. ఓ కిట్కీ పక్కంగ కూసున్న. ఐదు నిమిషాలైనంక సీటీ ఇన్పిచ్చింది. టేషన్ల ఒకాయన చేత్ల గంట పట్టుకొని అటూ ఇటూ ఊపుకుంట ప్లాట్ఫారమ్ మీద తిర్గుతున్నడు. పచ్చ కందీలు చూపిర్రు. రైలు కదిలింది.

గంతల్నె ఓ నడివయసోడు వొచ్చి నా యెన్కాల దూరంగ ఉన్న ఖాళీ సీట్ల కూసున్నడు. చుట్టుపక్కల ఎవ్వలు లేరు. మేం కూసున్నది తర్డు క్లాసు డబ్బా. మా డబ్బానానుకొని ఫస్టు క్లాసు డబ్బా ఉన్నది.



అద్దుమ్మన్యాతిరైంది. టేషన్ ఏదో తెల్వదు. లైట్లు లేవు. రైలు ఆగింది. అంతల్నె ఒకాయ్న ఉరుక్కుంటొచ్చి మా పక్క డబ్బాలకెక్కిండు. రైలు బైలెల్లింది.

గా వొచ్చినాయ్న మిలిట్రీ మనిషి లెక్కున్నడు. ఎత్తు పొడుగుండి బలంగున్నడు. భుజాలమీద నుండి మోకాళ్ళదాక ఒక లాంగ్ కోటు ఏసుకున్నడు. అది ఫస్టు క్లాసు డబ్బా. అండ్ల ఎవల్లు లేరు. ఒక్కడే ఉన్నడు. ఫస్టుక్లాసుల ధనవంతులే తప్ప గరీబోళ్ళు సఫర్ చెయ్యలేరు. గాయ్న మళ్ళ డబ్బంతా తిర్గి చూసిండు. ఒక తాన ఒక వయసామె సీటుమీద పండుకోనున్నది. గీయ్నను సూడంగనే లేసి కూసున్నది. అంతదన్క గామె ఒక్కతేనె ఉండె. గిప్పుడు రెండో మన్సి వొచ్చేసర్కి గామెకు ధైర్నెం వొచ్చింది. ఖుషీ అయ్యింది. తన బ్యాగ్ తీస్కోని గామన్సి కూసున్న కాడ్కి వొచ్చి పక్కనే కూసున్నది. ఆమె చేత్ల 'రసిక రంజనీ' అనే బూతు కతల మ్యాగజైనుంది. దాన్ని తన సంచిల బెట్కోని "ఎందాక వెళుతున్నరు" అంది.

"దూరం లేదు. రెండు మూడు గంటల ప్రయాణమే" అన్నడు. ఆ అనుట్ల ఏమీ ఖుషీ కనిపియ్యలే. ఏదో చెప్పాలె గాబట్టి చెప్పిండు. గాయ్న మన్సుల ఏదో పరేషాని ఉన్నట్లు అనిపియ్యబట్టింది. కిటికీ పక్కనె కూసున్నడు. అందగాడు.

కిటికీలకెల్లి సల్ల గాలి వొస్తున్నది. గాలికి నుదుటి మీద ఎంటెకలు ఎగిరెగిరి పడ్తున్నయి. మొకంల మంచి కళ ఉన్నది. గా మొకాన్ని మల్ల మల్ల సూడాలనిపిస్తది. ఏం మాట్లాడకుండ ఖామోషిగా కూసున్నడు. గామె గాయ్నను కన్నార్పకుండ సూడబట్టింది. గాయ్నతోని దోస్తాన చెయ్యాలని ఉబలాటపడసాగింది.

"నమస్తే అండీ! మిమ్మల్ని ఎక్కడో సూసినట్లున్నది. మీ పేరేంటో చెప్తరా?" అన్నది ముసి ముసి నవ్వుతూ.

"కృష్ణ" అన్నడు.

"మంచిపేరే! రూపానికి తగ్గట్టే ఉంది. నా పేరు రాధ" అన్నది.

గామె పేరు తెల్సుకోవాలన్న ధ్యాస ఆయ్నకు లేదు. గామె తన పేరు చెప్పినా గమ్మున ఉన్నడుగాని ఏం మాట్లాడలె.

రాధ తన ప్రయాణం కత మొదలెట్టింది. మీద మీద పడి మాట్లాడబట్టింది. ఇజ్జత్కు ఏదో మాట్లాడాలె కాబట్టి మాటలు కల్పిండు కృష్ణ. మాటలు మాటలు కల్సినై. ఇద్దరు దోస్తుల్లెక్క ముచ్చటిచ్చుకో బట్టిర్రు. గామె కృష్ణ కండ్లల్ల గుచ్చిగుచ్చి సూడబట్టింది. గామె కృష్ణనుంచి ఏదో కావాలనుకుంటున్నది. కృష్ణేమో మొకం యాలాడేస్కోని మాట్లాడబట్టిండు.

రైలు జోరుగ బోతున్నది. కిట్కీలకెల్లి బైటికి సూస్తే అంతా సీకటి. రాత్రే తన కండ్లకు కాట్కె పెట్టినట్లున్నది. ఏమీ కన్పిస్తలేద. సల్లగాలికి పెయ్యికి ముండ్లొస్తున్నయి. కృష్ణ అట్లనే కూసున్నడు. గామె సలిపెడ్తున్నది అన్కుంట కృష్ణ పక్కన వొర్సుకోని కూసున్నది. మళ్ళ ఆగలేక కిటికీలను మూసేసింది. లైట్లు ఆర్పేసింది. వొచ్చి కృష్ణ మెడల రెండు చేతులేసి "మీకు సలి పడ్తలేదా?" అన్నది ఓరగంట సూస్కుంట.

"ఇదేంది? మీకు సలిపెడ్తే పొయ్యి మీ సీట్ల పండుకోండి" అన్కుంట ఓరకు జర్గిండు.

ఆవె ఇంకొంచెం దగ్గర్కి జర్గింది. మీదబడి కౌగలిచ్చుకోబోయింది. కృష్ణ లేచి నిలబడ్డడు.

"ఇదేందండీ మీ తీరు నాకు నచ్చలేదు" అన్నడు.

"నా తీరు సూసి మీకర్థం కాలేదా! చెప్పండి! నాకేం కావాల్నో" అంది.

"నేనేమి మీకిస్తానని మాటియ్యలేదు కదా!"

"అదేంటి కోరి వస్తే నన్ను నెట్టేస్తున్నారెందుకు?"

"దేనికైనా సమయం సందర్భం ఉంటుంది. అయినగాని అపరిచితులమైన మన నడ్మ ఈ సరసమేంది?" అన్నడు.

"మీరెవరో నాకు తెల్వదు. కాని మిమ్మల్ని సూసినప్పట్నంది నా మన్సు మీ మీదకే లాగుతోంది. కాదనకండి" అంది దీనంగా.

''మీకు కామంతో కండ్లు మూస్కోపొయ్యినై. ఎన్కాముందాలోచిస్తలేరు" అన్నాడు ఈసడించుకుంట.

"నా కోరిక కాదంటావు? ఉండు నీ గతి ఏం చేస్తానో సూడు" అంది.

"ఏం చేస్తావో చేస్కో పో! సిగ్గు దప్పినదానా" అన్నడు.

"అట్లనా, అయితే చూడు!" అన్కుంట కిటికీలకెల్లి తొంగిసూసింది. ఏదో టేషను రాబోతోంది. ఎంటనే కొప్పెంటికేలు జార ఇడ్సింది. జాకెట్టు కొద్దిగా చింపుకొన్నది. రైలాగింది. మెల్లంగ ఘాయి మొదలుపెట్టి అర్సుకుంట బోయి డబ్బా తలుపు తీసింది. గట్టిగ అర్సింది. "రండి, రండి కాపాడండి. ఇతనెవరో నా మీద అత్యాచారం చెయ్యబోతున్నడు" అని అర్సింది. ప్లాటుఫారం మీదున్న జనం అంతా గుమిగూడిర్రు. నేను కూడ పొయ్యిన.

ఒక తాన
ఒక వయసామె
సీటుమీద పండుకోనున్నది.
గీయ్నను సూడంగనే లేసి
కూసున్నది.
అంతదన్క గామె ఒక్కతేనె
ఉండె. గిప్పుడు రెండో
మన్సి వొచ్చేసర్కి
గామెకు ధైర్నెం
వొచ్చింది.

కృష్ణ లేచి నిలబడ్డడు. జనం డబ్బల దూరిర్రు. క్రిష్ణ ఆమె దిక్కు కోపంతోని సూడబట్టిండు. కండ్లెర్రగయినై.

ఆమె గాజులు రెండు మూడు పలగ్గొట్టింది. జాకెట్టు చింపుకొన్నది. జనానికి అత్యాచారం జరిగిందన్న అనుమానం కల్గింది. పోలీసోళ్ళొచ్చిర్రు. కిందికి దిగమన్నరు. కృష్ణ కిందికి దిగిండు.

"సారు! ఇతనే నన్ను బలాత్కారం చేసాడు" అంది.

"ఎందయ్యా ఇది. నిజమేనా? చూస్తే పెద్ద మన్సి లెక్కున్నవ్" అన్నడు పోలీసాయన.

"సార్. నేను రిటాయిర్డ్ ఆర్మీ మెన్ను. ఈమె చెప్పేవన్నీ అబద్ధాలే. చూడండి అన్కుంట తన భుజాలమీది లాంగ్ కోట్ను జార ఇడ్సిండు. గాడ జమ అయిన జనం అంతా ఆశ్చర్యబోయిర్రు. గాయ్నకు రెండు చేతులు లేవు. మోచేతులదాక కోసేసి ఉన్నయి. గాయ్న సేత్లు జూసిన రాధ మాటలెగిరిపొయ్యినై. కిందపడిపొయ్యింది.

"పాపం రెండు చేతుల్లేనోన్ని పట్కోని బలవంతం చేసిండన్నది. ఇది మామూలు ఆడది కాదు. కామ పిశాచి. ఛీ! ఛీ! అన్కుంట జనం వాళ్ళ వాళ్ళ డబ్బాలల్లకు పోయిర్రు.

పోలీసాయ్న గామెను "నడు పోలీసు టేషన్కు" అన్నడు. గార్డొచ్చి "చేతులు ఎట్ల పొయ్యినై సార్" అని అడ్గిండు.

1965లో మిలిటరీల ఉన్నప్పుడు బార్డర్ దగ్గర జరిగిన యుద్ధంల పాకిస్తాన్ వాళ్ళేసిన బాంబు మా వ్యాన్ మీద పడ్డది. మాలోని నల్గురైదుగురు చనిపోయిర్రు. నా చేతులే పొయ్యినై. అందుకే ఉద్యోగం మానేసిన" అన్నడు.

"గామె అనవసరంగా మిమ్మల్ని బద్నామ్ చేసింది సారూ. మీరు గొప్పవారు. దేశం కోసం చేతులు పోగొట్టుకున్నరు. మీకు చేతులెత్తి దండంబెడ్తున్న సారూ" అని చెప్పి కృష్ణను మళ్ళీ ఆయ్న జాగాలో చెయ్యిపట్టి తీస్కొనిపొయ్యి కూసోబెట్టిండు.

రైలు దిగి పచ్చ కందీలు సూపుకుంట తనున్నకాడ్కి పొయ్యిండు. రైలు "కూ" అని కూతబెట్టుకుంట సాగిపొయ్యింది.

## హితోపదేశాలు

రెచ్చకొట్టకురా రగిలించుటకు కోపము
దువ్వకురా కయ్యమునకు కాలు
ఆజ్యంపొయ్యకురా మండించుటకు మంటలు
సూదులుగుచ్చకురా తెచ్చుకొనేవు చేటు
చెడపకురా చిక్కుల్లోపడి చెడిపోయేవు
గోతులుతియ్యకురా తీసినగుంటల్లో పడిపోయేవు
నటించకురా దొంగబుద్ధి బయటపడేను
విషంక్రక్కకురా పర్యావసానం అనుభవించేవు.
నిజందాచకురా సహించకు అన్యాయాలు
కొంపలుకూల్చకురా తగులుతాయి నిరాశ్రయులశాపాలు
ఘనుడననుకోకురా కూయకు కారుకూతలు
విపరీతబుద్ధిచూపకురా కొనితెచ్చుకొనేవు వినాశనము.
విప్పాలి మనస్సు చెప్పాలి హితాలు
తెరిపించాలి కళ్ళు చూపించాలి సత్యాలు
పట్టించాలి సన్మార్గము సాగింపచేయాలి పయనము
చేర్పించాలి గమ్యాలు సాధింపజేయాలి విజయాలు.



–గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630

## "వృద్ధాప్యము-ఓ బంధిఖానా..."

పిల్లలకి జన్మనిచ్చి
వారి ఆకలి దప్పికలు తీర్చి
వారి ప్రగతికై పాటు పడి
ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి
కష్టనష్టాలతో సహవాసం చేసి
బాధ్యత నిర్వహణలో నిత్య శ్రామికులై
వారసుల భవితకు వారధిగా నిలిచి
వారి కళను ప్రోత్సాహించిన
నేస్తపు మనసది(వృద్ధాప్యం)!
నలుగురిలో తన పిల్లలు నవ్వుల పాలు కాకూడదని
ఆరాటపడిన తల్లిదండ్రులకు నేడు
నాలుగు గోడలే అవుతున్నాయి తోడు!
జైలులో ఉన్న ఖైదీకైన దొరుకును
ఆత్మీయమైన పలకరింపు
జీవితపు చదరంగం ఆటలో అలసిన దేహాలకు
లేదు కనీస పలకరింపు!
చీదరింపులే తప్ప పలకరింపులు లేని వృద్ధాప్య జీవితాలు
ఉరుకుల,పరుగుల జీవితాల్లో
లేవు ప్రేమానురాగాలు
కనుమరుగవుతున్న కుటుంబ విలువలు
మంటల్లో గలుస్తున్న మానవత్వపు
ఛాయలు!
అమ్మ పెట్టిన గోరుముద్దలు మరుస్తూ...
నాన్న నేర్పిన నడకను పక్కా దారి
పట్టిస్తూ....
అవసరం తీరకా అమ్మనాన్నలను అనాథల్ని
చేస్తూ...
బాధ్యత మరిచి వృద్ధాశ్రమాలకి పంపిస్తూ...
యాంత్రిక జీవనానికి బానిసలుగా మారుతున్న
నేటి మానవ ప్రపంచం!
వృద్ధులు......
తరుగుతున్న సత్తువతో
అలసిపోతున్న ఊపిరిలో కన్న పేగు ప్రేమతో,
బంధాల బ్రతుకుకు దూరమవుతుంటే
కన్నపిల్లలతో, మనవడు-మనవరాల్లతో
గడపాలనే ఆఖరి కాంక్ష వారిది
చెమరించిన కనులలో సన్నగిల్లిన
ఆశల ఆవేదన వారిది
కన్నబిడ్డలలో కరువైన ఆప్యాయతల కోసం
ఆరాటపడే పసిహృదయం వారిది
జ్ఞాపకాలను పంచే వెలుగుల మది వారిది
అటువంటి వారి అనుభవాన్ని గౌరవిద్దాం....
మలి వయస్సులో అండగా ఉంటూ
కడవరకు ప్రేమిద్దాం...
"ఆస్తులు కాదు ముఖ్యం- ఆత్మీయతలే ప్రధానం"
అనే దిశగా ప్రయణిద్దాం...
యువతరానికి నైతికవిలువలను అందించి,
భవిష్యత్ తరాల వారికి మార్గదర్శకులవుదాం!!!



–నందిని గోపు
6302398650

## ఆరో అంగమైంది !

రాముడి చేతిలో కోదండం
కన్నయ్య కరంలో చక్రం
భీముడి హస్తంలో గదా
పరశురాముడి చేతిలో గొడ్డలి
అర్జునుడి చేతిలో గాండీవం
వృద్ధుడి మూడో హస్తం చాదస్తం !.
డిజిటల్ నరుడి అరచేతిలో..
మొలిచె ఆరో అంగమై స్మార్ట్ఫోన్
చిన్నారుల అరచేతుల్లో సహితం..
తిష్టవేసింది హిత శత్రువు !.
నాడు పుస్తకం హస్తభూషణం..
నేడు చరవాణే హస్తభూషణం
మానవుడి ఐదు అంగాలతో.
నేడు ఆరో అంగం వచ్చి చేరింది !.
రామణుడికి పది తలకాయలు..
మహా బలశాలి సెల్ఫోన్కు..
వాట్సాప్, ఫేస్బుక్, యూట్యూబ్..
లాంటి తలకాయలు ఎన్నో కదా !.
సోషల్ మీడియా వ్యసనాలు..
భావోద్వేగ భస్మాసుర హస్తాలు
అరిష్టాన్ని ఆలింగనం చేసుకోవద్దు
మానసిక రుగ్మతల ఆహ్వానిచొద్దు !.
పరిమితిలో వాడితేనే ప్రగతి..
వెఱ్ఱితలలు వేస్తే వ్యక్తిత్వ అధోగతి
అవసరానికి వాడితే ఆప్తమిత్రుడు
అతి చేస్తే గతి చెడగొట్టే శత్రువు !.



- మధుపాళీ
9949700037

## ప్రతి నాయక లెజెండ్

శ్రీనివాసరావు కోట
నటనలో పెట్టనికోట
రంగస్థలమే అతని తొలిబాట
ప్రతి ఘటించే పాత్రల నటనల్లోమేటి
అతడిలో పరివర్తన చెంది
మూర్తిభవించిన ప్రతినాయకుడు
మామ గారి ఇంటి అల్లుడు
అందించే హాస్యం అజరామరం
తండ్రి పాత్రలో తలపండిన నటన
తాతగారిలా ఠీవి హాస్యభరిత పోకడ
అందమైన కళానైపుణ్యం అక్కడ
ఆహార్యం హావభావాలు
నిజాయితి నిర్మలత్వం
అతని నటన ఔచిత్యం
శాసన సభ్యత్వం
జనం ఇచ్చిన గౌరవం
విశ్వంలో విభిన్న పిసినారులున్న
మరచి పోని మరపు రాని పిసినారి
పాత్ర మరెవ్వరూ పోషించ లేరు...
నందులు వరించిన
పద్మశ్రీ లభించిన
నటన ఎలా చదివిన
అదేనటన మన కోట...
అతని సినీ జీవితం
నిత్యనూతనం
అతడు లేడు..అతడు రాడు
అతని పాత్రలు
కంటితెరముందుంటాయి
అతడొక తెలుగువారి
ప్రతినాయక లెజెండ్



-రేడియమ్
9291527757

## బ్రేక్ ది షెల్

మనసు చుట్టూ దృఢమైన
కంచుకోటను కట్టి
దాని తాళానికి గట్టి
లక్క సీలు వేసి..
అంతరాంతరాల
మాటల ముత్యాల మూటని
ఎవరి ముందూ విప్పకుండా
గుట్టునే గట్టిగా నమ్ముకున్న నీ ముఖం
నిత్యం అభావాన్నే పలికిస్తుంటే..
నువ్వు అత్తిపత్తి లాంటి
అంతర్ముఖుడవో..
అహం పెంకు మాటున
దాగిన నత్తగుల్లవో.. తెలిసేదేలా?
మరో మనిషి నంటకుండా
కచ్చితంగా నువ్వు పాటించే దూరం
కావాల్సినోళ్లనే కాకుండా..
కన్నవాళ్ళనీ కసిరి..
విసిరే నీ కఠోర నైజం...
మాట్లాడాల్సి వస్తుందేమోనని
మౌనానివై ప్రవహిస్తూ..
కన్ను కలపాల్సి వస్తుందేమోనని
సూన్యపు సాలెగూటిలో
చిక్కినట్లు నటిస్తే..
అందని చందమామవో
అర్థమవని ప్రహేళికవో
చలించని జడునివో
జ్వలించని
మంచువో నిర్ణయించేదెలా?
ముందుగా నిన్ను నువ్వు తెలుసుకుంటే
మానవత్వమున్న మనిషి వవుతావు!
చెంతచేరి చెయ్యి కలిపితే
ఆత్మీయ మిత్రుడ వవుతావు!
అందుకే.. అత్యాధునికుడా!
ముందుగా..
నీ "షెల్" ని "బ్రేక్" చెయ్యి!



– షేక్ కాశింబీ,
9052216044

## ఇక్కడ భూమి వుంది

ఎవరో పర్వతం తెచ్చి
ఇక్కడ పెట్టి వెళ్లి పోయారు
అది మేఘాలను తాకి వానయ్యింది
భూమి పండుతూవుంది రైతు బ్రతికిస్తున్నాడు.
కొండను కోసి ఇల్లు నిలబడింది
నేలను తవ్వి అమ్ముకున్నావు
నువ్వుండవు ప్రకృతి ప్రళయమయ్యింది.
చెట్లు హత్య చేయబడుతున్నాయని
గాలి దుఃఖిస్తూ
మళ్ళీ మళ్ళీ పుడుతుంది.
మనిషి బ్రతకాలని
నదిని వెంట తీసుకుపోతాను
అక్కడ భూమి వుంది
గింజలు మొలిస్తే
పక్షులూ, పశువులు
ఆహారాన్ని పోగుచేస్తాయి



–గుబ్బల శ్రీనివాస్
8906697777

## మా ఊరి జాతర

రండి రండి చూసొద్దాం
మా ఊరి సరదా జాతర.
నైవేద్యం గా పొంగళ్ళు
ఊరేగింపు గా వేషాలు.
ఉత్సాహంగా డప్పులు
ఉరకలు వేసే నృత్యాలు.
దేవుడు వస్తే పూనకాలు
దాహం వేస్తే పానకాలు .
భక్తి,శ్రద్ధలతో మొక్కులు
గారడీ వాళ్ళ జిమ్మిక్కులు.
పాటలతో మేళ,తాళాలు
ఆటలతో బాజా భజంత్రీలు
రండి,రండి చూసొద్దాం
మా ఊరి సరదా జాతర



- కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

## చిప్స్ ప్యాకెట్

పొట్టనిండా విషవాయువులు నింపుకొని
రంగు రంగు ప్యాకెట్లతో పిటపిటలాడుతుంటది
కొట్టులో కొక్యానికి ఊరిస్తు ఊగుతుంటది .
షావుకారు షాపులో గాలికి సడి చేస్తూ
కొను కొను మని కన్ను గీటుతుంటది
కొంపకు చేరక ముందే కొనిపిస్తానంటది.
ఒంటినిండా ఉప్పు నింపుకొని
పంటికిందికి రానాఅంటు సరసమాడుతుంటది
నవ్య రుచుల మసాలా నషాలానికంటిచి
నాలుక మీద నాట్యమాడుతంటది
రంగునీళ్ల డబ్బాతో వియ్యంమొందుతంటది.
పప్పుండలు పల్లి పట్టిలకు పాతరేసి
బొంగు లడ్డును బొంద పెట్టింది
ఆరోగ్యానికి ఆసరైదాని ఆగం చేసి
అనారోగ్యానికి పాదులు తీసింది .
ఊసుపోక ఊరించుకుంట తిన్నోనికి
ఊబకాయాన్ని కానుకగా ఇస్తది
హానికర ఆమ్లాలను అమ్మచే కొనిపించి
పసిడి బుగ్గల పసిబిడ్డలకు తినిపిస్తనంటది
ఉదరకోశానికి శాపమై పీడిస్తనంటది.



–డా.ఎడ్ల కల్లేశ్
9866765126

